ప్రతిపక్షం

www.prathipaksham.in

స్టార్క్ వస్తున్నాడా..? 8

మంగళవారం 24.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 4 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

భారత్‌పైనా పశ్చిమాసియా యుద్ధం ప్రభావం

భారత్‌కు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి

- యుద్ధం వల్ల వాణిజ్యం దెబ్బతింటోంది
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం
- లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 23: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మాత్రమే కాకుండా ప్రజల జీవన విధానంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన అన్నారు. సోమవారం లోక్‌సభలో ఆ అంశంపై మాట్లాడిన ప్రధాని, పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని స్పష్టం చేశారు. అమెరికా - ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై కూడా పలు రంగాల్లో కనిపిస్తుందని మోదీ చెప్పారు. ముఖ్యంగా ఆర్థిక, భద్రతా, మానవతా కోణాల్లో సవాళ్లు ఎదురవుతున్నాయని వివరించారు. భారత్‌కు అవసరమైన ముడి చమురు, సహజ వాయువు (గ్యాస్)లో పెద్ద భాగం పశ్చిమాసియా దేశాల నుంచే వస్తుందని ప్రధాని గుర్తు చేశారు. ఆ ప్రాంతం ఇతర దేశాలతో వాణిజ్యానికి కీలక మార్గంగా కూడా పనిచేస్తుందని చెప్పారు. అందువల్ల అక్కడి పరిస్థితులు దిగుమతులు, ఎగుమతులు, సముద్ర మార్గ రవాణాపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు.

దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నాం

హర్మూజ్ జలసంధి ద్వారా భారత్‌కు భారీ స్థాయిలో చమురు, గ్యాస్, ఎరువులు వంటి కీలక వస్తువులు రవాణా అవుతున్నాయని తెలిపారు. అయితే యుద్ధ పరిస్థితుల వల్ల ఆ మార్గంలో నౌకల రాకపోకలు కష్టతరంగా మారాయని అన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా అంతరాయం కలగకుండా చూసిందని మోదీ స్పష్టం చేశారు. దేశంలో ఎల్‌పీజీ వినియోగం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడి

...:: మిగతా 2లో

విద్వేష పూరిత ప్రసంగాలు, నేరాల బిల్లుకు

మంత్రివర్గం ఆమోదం

- గిగ్ వర్కర్లు, న్యాయవాదుల రక్షణ బిల్లులకూ గ్రీన్ సిగ్నల్
- కీలక బిల్లులను ఆమోదించిన రాష్ట్ర మంత్రివర్గం
- రోహిత్ వేముల చట్టం విధివిధానాలకు కేబినెట్ సబ్‌కమిటీ
- మెట్రో స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం
- కులగణనపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ నివేదిక
- పరిశీలించే బాధ్యత కేబినెట్ సబ్ కమిటీకి అప్పగింత
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 23: విద్వేష పూరిత ప్రసంగాలు, నేరాల బిల్లుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లును కూడా కేబినెట్ ఆమోదించింది. అసెంబ్లీ సమావేశాల్లో కీలక బిల్లులు ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సమావేశాలు ముగిసిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమైన కేబినెట్ కీలక బిల్లులకు ఆమోదముద్ర వేసింది. విద్వేషపూరిత ప్రసంగాలు నేరాల నిరోధక బిల్లును మంత్రివర్గం ఆమోదించింది. మత సామరస్యానికి భంగం కలిగించేలా సోషల్ మీడియా పోస్టులు అల్లర్లు, ఘర్షణలు ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికుల సంక్షేమం భద్రత కోసం రూపొందించిన తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లును మంత్రివర్గ సమావేశం ఆమోదించింది.

గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు

రాష్ట్రంలో సుమారు 4.20 లక్షల మంది గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫారం ఆధారిత కార్మికులు ఉన్నారు. గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్‌తో పాటు సంక్షేమ బోర్డు, నిధిని ఏర్పాటు చేస్తారు. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడంతో పాటు హక్కులకు రక్షణకు కల్పించేలా బిల్లును రూపొందించారు. గతంలోనే మంత్రివర్గం ఆమోదించినప్పటికీ ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన సోషల్ సెక్యూరిటీ కోడ్ కు అనుగుణంగా స్వల్ప మార్పులు చేశారు. సుమారు 60 కిలోమీటర్ల హైదరాబాద్ మెట్రో వ్యవస్థను ఎల్‌అండ్‌టీ కంపెనీ నుంచి స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం

...:: మిగతా 2లో



విద్యుత్ ఉద్యోగులకు 1.20 కోట్ల ప్రమాద బీమా

- మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం
- రూ. కోటి చొప్పున ప్రమాద బీమా పంపిణీ
- ఇందిరమ్మ రాజ్యంలో ఉద్యోగుల క్షేమమే మా ప్రాధాన్యత
- ఉద్యోగ కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి, దేశ చరిత్రలోనే చారిత్రకం: భట్టి

...:: 2లో

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

- కాలుష్యం నుంచి హైదరాబాద్‌కు విముక్తి
- మూసీ పునరుజ్జీవంపై రాజకీయాలొద్దని వినతి
- అవసరమైనే కేబినెట్ కమిటీని వేస్తామని ప్రకటన
- బాధితులకు అన్ని రకాల ఆదుకుంటామని హామీ
- మండలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

...:: 2లో

అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



- రైతుభరోసా, పంట బోనస్, బీమా ఏదీ?
- రుణమాఫీపై చర్చకు మేం సిద్ధం
- 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
- ప్రాజెక్టులను గాలికి వదిలేశారు
- 'యంగ్ ఇండియా' స్కూళ్లలో వెయ్యి కోట్ల స్కామ్
- ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతిలో భారీ కుంభకోణం
- నిజాయితీ ఉంటే హౌస్‌కమిటీ వేయాలి
- ఫైళ్లు స్పీకర్ ముందు పెడితే అక్రమాలను నిరూపిస్తా
- అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

> యువవికాసం పేరుమార్చి.. 'రేవంత్ ఆత్మీయ మోసం', 'భట్టి యువ భ్రమలు' అని పెట్టుకోండి. ప్రభుత్వాలు వస్తయ్, పోతయ్. కానీ, రాష్ట్రం బాగుండాలి. మీరు మమ్మల్ని ఓడించారు సరే.. కానీ తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అభివృద్ధిని ఓడించకండి. చరిత్ర ఎప్పుడూ నిర్మాణాన్ని గుర్తు పెట్టుకుంటుంది. గౌరవిస్తుంది. విధ్వంసాన్ని క్షమించదు. కచ్చితంగా శిక్షిస్తుంది. మీరు సృష్టించిన ఈ వినాశనం.. రేపు మిమ్మల్నే కబళిస్తుంది. రాష్ట్ర ప్రజలకు శాపమవుతుంది. ఇప్పటికైనా అబద్ధాలు ఆపేసి, అభివృద్ధి వైపు అడుగులు వేయండి. లేదంటే తెలంగాణ సమాజం మిమ్మల్ని క్షమించదు!
>
> - హరీశ్‌రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 23 : రైతులను ముంచేందుకు ఇన్ని జిమ్మిక్కులు, మ్యాజిక్కులు చేస్తారా? అని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విరుచుకుపడ్డారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన 'రుణమాఫీకి రూ.51 వేల కోట్లు అవుతుందని బ్యాంకర్ల మీటింగ్‌లో ప్రకటించారు. మొదటి బడ్జెట్‌కు వచ్చేసరికి అది రూ.31 వేల కోట్లకు కుదించారు. రెండో బడ్జెట్ నాటికి అది రూ.20,616 కోట్లకు కుదించారు. కానీ.. మీరు రుణమాఫీ చేసింది కేవలం రూ.20,157 కోట్లే. ఐసు ముక్కలు కరిగినట్టు రుణమాఫీ లెక్కలు కరిగిపోయినయ్' అని తూర్పారబట్టారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మూడు బడ్జెట్ల తీరును లెక్కలు సహా నిండు సభలో సోమవారం ఎండగట్టారు. 'రైతులకు స్వరాష్ట్రంలో కేసీఆర్ కొండంత అండగా నిలిచారు. 24 గంటల ఉచిత కరెంటు, సాగునీరు ఇచ్చారు. సమయానికి ఎరువులు, విత్తనాలు ఇచ్చిండ్రు. రైతుల ఆత్మహత్యలు

...:: మిగతా 2లో

దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

- హైకోర్టులో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సవాల్
- దానంతో పాటు స్పీకర్ కు నోటీసులు జారీ
- నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం
- కేసు తదుపరి విచారణను ఏప్రిల్16కు వాయిదా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 23: ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దానం నాగేందర్ పార్టీ మారలేదంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టులో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సవాల్ చేశారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన హైకోర్టు ఎమ్మెల్యే దానం నాగేందర్‌తోపాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని వారిని హైకోర్టు

...:: మిగతా 2లో

ఈ కార్ రేసింగ్ కేసులో ఏసీబీ చార్జిషీట్

ఏ1గా మాజీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్

ఏ2గా మాజీ ఐఏఎస్ అరవింద్ కుమార్

- నిబంధనలకు విరుద్ధంగా 55 కోట్ల బదిలీ చేశారు
- బదిలీకి ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు
- చార్జిషీట్‌లో ఏసీబీ ఆరోపణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 23: ఫార్ములాఈ కార్ రేసింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఏసీబీ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ చార్జిషీట్‌లో మాజీ మంత్రి కేటీఆర్ ఏ1గా చేర్చింది. నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు ₹55 కోట్ల నిధుల మళ్లింపు, అవినీతి నిరోధక చట్టం కింద నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం వంటి అభియోగాలను ఏసీబీ చార్జిషీట్ లో పొందుపరిచింది. ఏ1గా మాజీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ఏ2గా మాజీ ఐఏఎస్, మాజీ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఏ3గా మాజీ హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర రావు, ఏ5గా యూకే సంస్థ

...:: మిగతా 2లో

బీజేపీ, ఆర్ఎస్ఎస్ సృష్టించిన పదం 'వనవాసి'

గిరిజనులను 'వనవాసి' అని సంబోధించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ విమర్శలు గుప్పించారు. శతాబ్దాలుగా గిరిజనులకు చెందిన నీరు, అడవులు, భూములపై వారి అసలైన యాజమాన్య హక్కులను నిరాకరించడానికే ఈ పదాన్ని సృష్టించారని ఆరోపించారు.

7

జనగణన ఆధారంగా మహిళలకు రిజర్వేషన్లు

కేంద్ర ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ఆధారంగా మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతిపాదిత స్వరూపం ప్రకారం లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుంచి 816కు పెరుగుతాయి.

7

రైతు రుణమాఫీ ప్రతిపాదన పరిశీలనలో లేదు

రైతులకు పూర్తి రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో వెల్లడించారు.

7

ఇరాన్‌పై 5 రోజులు దాడులు చేయం

ఇరాన్‌పై దాడులకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌కు విధించిన 48 గంటల గడువుపై వెనక్కి తగ్గారు.

2

రాష్ట్రీయం

కోర్టు ధిక్కరణ కేసులో హైడ్రా కమిషనర్‌ను దోషిగా తేల్చిన హైకోర్టు

- బతుకమ్మ కుంట నిర్మించడంపై హైకోర్టు తీవ్ర అసహనం
- నాలుగు వారాల్లో అన్ని నిర్మాణాలను తొలగించాలని ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు హై కోర్టులో చుక్కెదురైంది. కోర్టు ధిక్కరణ కేసులో తెలంగాణ హైకోర్టు ఆయనను దోషిగా తేల్చింది. బతుకమ్మ కుంట భూమి వ్యవహారంలో ఉద్దేశ పూర్వకంగానే రంగనాథ్ కోర్టు ఆదేశాలు ఉల్లంఘించారని సోమవారం హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ వివాదంలో ఉన్న భూమిని, ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బతుకమ్మ కుంట నిర్మించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది హైకోర్టు. వివాదంలో ఉన్న బతుకమ్మ కుంట భూమి వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై విచారించిన హైకోర్టు సోమవారం హైడ్రా కమిషనర్‌ను దోషిగా తేల్చింది. నాలుగు వారాల్లో సదరు భూమిలో చేపట్టిన అన్ని నిర్మాణాలను తొలగించాలని, పూర్తి నివేదికను అందజేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అత్యున్నత ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. చట్టాన్ని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన ప్రభుత్వ అధికారులపై కఠిన చర్యలు తప్పవని హైకోర్టు హెచ్చరించింది.

విద్వేష పూరిత ప్రసంగాలు, నేరాల బిల్లుకు

మంత్రివర్గం ఆమోదం

మొదటిపేజీ తరువాయి

తీసుకుంది. అప్పులతో పాటు మొత్తం 15 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఎల్ అండ్ టీకి చెల్లించి ఫేజ్ 1 ప్రాజెక్టు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే సబ్‌కమిటీ నివేదికను సమర్పించింది. ప్రభుత్వం తరపున నిధుల చెల్లింపులు, లావాదేవీలు నిర్వర్తించే బాధ్యతను హైదరాబాద్ మెట్రో రైల్‌లిమిటెడ్‌కు మంత్రివర్గం అప్పగించింది. హెచ్ఎంఆర్ఎల్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

తల్లిదండ్రుల మద్దతు బిల్లు..

తల్లిదండ్రుల మద్దతు బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా 10 వేలు ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని వారి తల్లిదండ్రులకు ఇచ్చేలా బిల్లును రూపొందించారు. విద్యాలయాల్లో కుల వివక్ష నియంత్రించే ఉద్దేశంతో రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పన కోసం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటుకు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీలో దామోదర రాజనరసింహ, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉంటారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు...

తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయవాదులపై దాడులను కట్టడి చేసేందుకు, రక్షణ కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించారు. న్యాయవాద దంపతులు వామనరావు హత్యల వంటి ఘటనల నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ, తగిన భద్రత కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని స్వతంత్ర నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ఆమోదించింది. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను కేబినెట్ చర్చించింది. నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించే బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది.

భారత్‌పైనా యుద్ధం ప్రభావం

మొదటిపేజీ తరువాయి

ఉందని ఆయన తెలిపారు. సుమారు 60 శాతం ఎల్‌పీజీ అవసరాలు దిగుమతుల ద్వారానే నెరవేరుతున్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశీయ వినియోగదారులకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, అంతేకాకుండా దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నామని వెల్లడించారు. పశ్చిమాసియాలో దాదాపు ఒక కోటి మంది భారతీయులు నివసిస్తూ పనిచేస్తున్నారని ప్రధాని గుర్తు చేశారు. అలాగే వాణిజ్య నౌకల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయ సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై భారత్‌కు సహజంగానే ఎక్కువ ఆందోళన ఉంటుందని చెప్పారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అక్కడ ఉన్న భారతీయుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్నామని మోదీ తెలిపారు. ఇప్పటికే పశ్చిమాసియా దేశాల అధినేతలతో రెండు దఫాలుగా మాట్లాడినట్లు చెప్పారు. భారతీయుల భద్రతకు వారు హామీ ఇచ్చారని వెల్లడించారు.

భారతీయులకు హెల్ప్‌లైన్లు, ఎమర్జెన్సీ సేవలు

సంక్షోభం సమయంలో ఇప్పటివరకు 3.75 లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారని తెలిపారు. ఇరాన్ నుంచి మాత్రమే దాదాపు వెయ్యి మంది తిరిగి వచ్చినట్లు చెప్పారు. అందులో 700 మందికి పైగా వైద్య విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో కొన్ని మరణాలు, గాయాలు సంభవించాయని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్న భారతీయులకు 24 గంటల హెల్ప్‌లైన్లు, ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గల్ఫ్ దేశాల్లో సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలను రద్దు చేసినట్లు మోదీ పేర్కొన్నారు. విద్యలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించిందని ప్రధాని వివరించారు. దేశంలో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను గణనీయంగా పెంచినట్లు చెప్పారు. ప్రస్తుతం భారత్ వద్ద 5.3 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ నిల్వలు ఉన్నాయని, వాటిని 6.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అదేవిధంగా గతంలో 27 దేశాల నుంచి మాత్రమే ఇంధనాన్ని దిగుమతి చేసుకునే భారత్, ఇప్పుడు 41 దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటోందని మోదీ చెప్పారు. ఇది సరఫరా భద్రతను పెంచేందుకు తీసుకున్న ముఖ్యమైన నిర్ణయమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న క్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రధాని హెచ్చరించారు. కాబట్టి దేశం ఐక్యంగా ఉండి ఈ సవాళ్లను ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో చూపిన ఐక్యతను మరోసారి ప్రదర్శించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

“

భారత్ సవాళ్లకు భయపడదు, వాటిని ఎదుర్కొంటుంది. ప్రపంచంలోని అన్ని రంగాలపై యుద్ధ ప్రభావం పడింది. యుద్ధ పరిస్థితులను మనం ఎదుర్కొంటున్న తీరును ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయి. మాకు దేశ ప్రయోజనాలే ముఖ్యం. శాంతి చర్చలను భారత్ ఎప్పుడూ స్వాగతిస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆత్మవిశ్వాసంతో భారత్ ముందుకు సాగుతోంది.

- ప్రధాని నరేంద్ర మోడీ

ఇరాన్‌పై 5 రోజులు దాడులు చేయం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన
- ట్రంప్ భయపడిపోయారు: ఇరాన్
- ఇంధన ధరలను తగ్గించుకునేందుకు ట్రంప్ ఎత్తుగడ

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

ఇరాన్‌పై దాడులకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌కు విధించిన 48 గంటల గడువుపై వెనక్కి తగ్గారు. రెండ్రోజులుగా ఇరాన్‌తో చర్చలు ఫలవంతంగా జరగడంతో దాడులను విద్యుత్, ఇంధన సదుపాయాలపై దాడులను ఐదు రోజులు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంపై స్పందించిన ఇరాన్ ట్రంప్ భయపడ్డారని ఎద్దేవా చేసింది. తాము ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి చర్చలు జరపలేదని స్పష్టంచేసింది. ట్రంప్ నిర్ణయంతో ముడిచమురు ధర అమాంతం పడిపోయింది.

హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌కు విధించిన 48 గంటల డెడ్‌లైన్‌ను ట్రంప్ వాయిదా వేశారు. ఇరాన్‌లోని అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఇంధన మౌలిక వసతులపై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేయాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమాసియాలో తమ మధ్య ఉన్న శత్రుత్వాలకు సమగ్ర పరిష్కారం కనుగొనే దిశగా అమెరికా, ఇరాన్ గత రెండ్రోజులుగా ఫలవంతమైన చర్చలు జరిపాయని తెలియజేశారు. ఈ వారం అంతటా తమ మధ్య లోతైన, సవివరమైన, నిర్మాణాత్మక చర్చలు కొనసాగనున్నాయని పోస్టుచేశారు. సానుకూల వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై జరపాల్సిన అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని యుద్ధ శాఖను ఆదేశించానని పేర్కొన్నారు. అయితే, పూర్తి నిర్ణయం మాత్రం ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలు, చర్చల ఫలితాలపై ఆధారపడి ఉంటుందని వివరించారు. ఈ విషయంపై మీరు శ్రద్ధ చూపినందుకు ధన్యవాదాలు అంటూ ట్రంప్ రాసుకొచ్చారు. ఇరు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరుగుతున్నాయన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. అంతర్జాతీయంగా మండిపోతున్న ఇంధన ధరలను తగ్గించుకునేందుకు ట్రంప్ వేసిన ఎత్తుగడ ఇదని ఆరోపించింది. మార్కెట్లను శాంతింపజేసి, చమురు ధరలను మళ్లీ దారిలోకి తెచ్చుకునేందుకే ట్రంప్ ఈ ఐదు రోజుల వాయిదా ప్రకటన చేశారని ఇరాన్ పేర్కొంది. ఇది కేవలం అమెరికా తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి పన్నిన వ్యూహమే తప్ప నిజమైన శాంతి చర్చలు కావని ఇరాన్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

విద్యుత్ ఉద్యోగులకు 1.20 కోట్ల ప్రమాద బీమా



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: విధి నిర్వహణలో మరణించిన విద్యుత్ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు భారీ ఆర్థిక సాయాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. సీపెక్ సర్వే ప్రకారం రూ. 5 లక్షల బీమా ఆయా కుటుంబాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దనే భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చామని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు

ఉద్యోగుల భద్రతకు, కుటుంబాలకు భరోసా

ఉద్యోగుల భద్రతకు, వారి కుటుంబాల భరోసాకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సంకేతాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటి చెప్పామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్, సింగరేణి కార్మికుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక ప్రమాద బీమా పథకం కింద భారీ మొత్తాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఓర్సు సురేశ్ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఉద్యోగి. ముక్తార్ బేగ్ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉద్యోగి. వీరి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున బీమా చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు.

ఇలాంటి పథకం దేశంలో మరెక్కడా లేదు: భట్టి

దేశ చరిత్రలోనే ఇదొక చారిత్రక కార్యక్రమమని, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఇలాంటి పథకం దేశంలో మరెక్కడా లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ మంత్రిమండలి ఉద్యోగుల క్షేమం కోసం ఆలోచన చేసి, క్యాబినెట్‌లో ఈ కీలక నిర్ణయం తీసుకున్నామని ఆయన వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు సోమవారం అసెంబ్లీ హాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ. కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దురదృష్టవశాత్తు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉందని, యజమానిపై ఆధారపడిన జీవితాలు తారుమారవుతున్న తీరును తాము గమనించామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో పనిచేస్తున్న ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి ఇలాంటి నిస్సహాయ స్థితి రాకూడదన్న మానవీయ ఆలోచనతోనే, దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 1.20 కోట్ల భారీ ప్రమాద బీమాను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్రమాద బీమా పథకం ద్వారా విద్యుత్ సంస్థల్లోని 51 వేల మందికి పైగా, సింగరేణి సంస్థలోని 41 వేల మంది, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు 7.57 లక్షల మంది కుటుంబాల్లో ఈ పథకం భరోసాను కల్పిస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సింగరేణి, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో సంస్థల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ పథకాన్ని ఇప్పటికే ప్రారంభించామని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈ క్రమంలోనే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ 2025 అక్టోబర్ 10న మరణించిన వరుస సురేష్, అలాగే మహబూబ్ నగర్ సర్కిల్ సివిల్ విభాగంలో ఆర్టిజన్ గా పనిచేస్తూ 2025 ఏప్రిల్ 19న మరణించిన ముక్తార్ బేగ్ కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున బీమా చెక్కులను అందజేసి ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వీరి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రపంచంలోని ఏ అభివృద్ధి చెందిన దేశానికీ సాధ్యం కాని రీతిలో ఒక మహత్తర జీవిత బీమా పథకాన్ని ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టామన్నారు. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా చూడకుండా రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు, ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల చొప్పున రక్షణ కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని' అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్, ఆజారుద్దీన్, ఎనర్జీ సెక్రెటరీ నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: దేశంలో ఎన్నో నగరాలు ఉన్నప్పటికీ ప్రధానంగా న్యూఢిల్లీ, ముంబై, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల గురించే చర్చ జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నగరాల సమస్యలను ఉదాహరణగా చూపుతూ, హైదరాబాద్‌ను ముందుచూపుతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం మండలిలో పలువురు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. 'హైదరాబాద్ రాక్స్ అండ్ లేక్స్ సిటీ.. ఇది ఓల్డ్ సిటీ కాదు' అని సీఎం స్పష్టం చేశారు. ఈ నగరాల పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా ఉండేందుకు తన ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

మూసీ పునరుజ్జీవంపై రాజకీయాలు వద్దు

మూసీ నది పునరుజ్జీవం విషయంలో రాజకీయాలు చేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. శాసన మండలి వేదికగా మాట్లాడిన ఆయన, అభివృద్ధి దిశగా ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకుందని తెలిపారు. మూసీ అభివృద్ధి అందరి బాధ్యత" అని గుర్తు చేశారు. మూసీ ప్రక్షాళనపై అనవసర రాజకీయాలు జరుగుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "ఆపాలని కాకుండా ముందుకు తీసుకెళ్లేందుకు సూచనలు ఇవ్వండి. అభివృద్ధి విషయంలో రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టాలి" అని అన్నారు.

కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

ప్రతిపక్షాల సూచనలను స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌నేతలు తన దగ్గరకు వచ్చేందుకు ఇబ్బందులుంటే అవసరమైతే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వారితో చర్చించి మూసీపై తగు సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ "రాజకీయ పార్టీల ఉచ్చులో పడవద్దు. అపోహలకు లోనవ్వద్దు. మా అధికారులు మీకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారు" అని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రో స్వాధీనం

తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ అసెంబ్లీ స్పీకర్‌ను బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు కోరారు. దీనిపై స్పీకర్ విచారణ చేపట్టకపోవడంతో.. వారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ విచారణ జరిపి.. ఎవరూ పార్టీ ఫిరాయింపునకు పాల్పడలేదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఫారమ్ తీసుకుని ఎంపీగా దానం నాగేందర్ ఎన్నికల్లో పోటీ చేశారని బీజేపీ ఎమ్మెల్యే పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తీసుకున్న జీతభత్యాలను వెనక్కి తీసుకోవాలంటూ కోర్టులో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.

ఈ కార్ రేసింగ్ కేసులో ఏసీబీ చార్జిషీట్

మొదటిపేజీ తరువాయి

ఎఫ్ఈఓలను ఏసీబీ చార్జిషీట్లో చేర్చింది. 2023లో ఫార్ములాఈ రేసు నిర్వహణలో హెచ్ఎండీఏ నుండి నిబంధనలకు విరుద్ధంగా సుమారు ₹55 కోట్ల నిధులను విదేశీ సంస్థకు బదిలీ చేశారని, ఈ నిధుల బదిలీకి ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదని, అలాగే ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఈ లావాదేవీలు జరిగినట్లు ఏసీబీ ఆరోపించింది. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో ఆదేశాల మేరకే నిధులు విడుదల చేసినట్లు ఏ2 అరవింద్ కుమార్ పేర్కొన్నట్లు ఏసీబీ తెలిపింది. గతంలో గవర్నర్ నుండి వచ్చిన ప్రాసిక్యూషన్ అనుమతితో ఏసీబీ ఈ చార్జిషీట్ దాఖలు చేసింది.

అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

ఆగిపోవాలని రైతుబంధు పథకం తెచ్చారు' అని హరీశ్ అన్నారు. కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతు బంధు సహాయం ఆపలేదని, 11 విడతల్లో రూ.72 వేల కోట్లు క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి బడ్జెట్ లో రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. రెండో బడ్జెట్ లో రూ.12 వేల నిచెప్పి, ఇప్పుడు అవీ ఇవ్వడం లేదని విమర్శించారు. రైతు భరోసా 15 వేలకు ఎప్పుడు పెంచుతారో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అన్ని పంటలకు బోనస్ ఎప్పుడు?

అన్ని పంటలకు బోనస్ ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని, మొదటి బడ్జెట్ లో సన్న వడ్లకే పరిమితం చేశారని హరీశ్ దుయ్యబట్టారు. గత యాసంగి బోనస్ రూ.1,161 కోట్లు ఎగవేశారని విమర్శించారు. 'వీళ్ల సంకల్పంలో ప్యూరిటీ లేదు. వీళ్లు చెప్పే మాటల్లో క్లారిటీ లేదు. బడ్జెట్ ప్రసంగాలకు సాంటిటీ లేదు. అమలు చేస్తారనే ష్యూరిటీ లేదు. మ్యానిఫెస్టోలో ఒకటి రాస్తారు.. బడ్జెట్ లో ఒకటి చదువుతారు.. క్షేత్రస్థాయిలో ఒకటి చేస్తారు. అందుకే ఇది నో ప్యూరిటీ, నో క్లారిటీ, నో ష్యూరిటీ గవర్నమెంట్' అని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్నట్టు తయారైందని హరీశ్ మండిపడ్డారు. మొదటి బడ్జెట్ లో భూమి లేని నిరుపేద రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని చెప్పి.. రెండో బడ్జెట్ లో రూ.12 వేలు ఇస్తున్నామని చెప్పారని గుర్తుచేశారు. ఆ రూ.12 వేలు క్షేత్రస్థాయిలో ఎంత మంది కూలీలకు ఇచ్చారో చెప్పాలి? అని డిమాండ్ చేశారు.

2 లక్షల ఉద్యోగాలెక్కడ?

'మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామన్నారు.. ఆ 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?, నియామక పత్రాలు చూపిస్తారా? లేదా నిరుద్యోగుల విజయోత్సవాలు కూడా నిర్వహిస్తారా?' అని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. 'నిరుద్యోగులను ఓటింగ్ మిషన్ల లెక్క వాడుకొని, వాళ్ల నెత్తురు కండ్ల చూసిన మీ పాపం కడిగేసుకోవాలంటే ఇప్పటికైనా మీరు చెప్పిన ప్రకారం వెంటనే రెండు లక్షల ఉద్యోగాల నియామక ప్రక్రియ ప్రారంభించాలి' అని హితవు పలికారు. బీఆర్ఎస్ హయాంలో 1.62 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చామని, 95 శాతం లోకల్ రిజర్వేషన్లు తెచ్చామని గుర్తుచేశారు. వడ్డీలేని రుణాలపై ప్రభుత్వం అబద్ధాలు ఆడుతున్నదని హరీశ్ విమర్శించారు. మొదటి బడ్జెట్ లో ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా ఐదేండ్లలో రూ.లక్ష కోట్లకు వడ్డీలేని రుణం అందిస్తామని చెప్పారని, రెండో బడ్జెట్ లో కోటి మంది మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణం అందిస్తామని, ఈ బడ్జెట్ లో ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల మేరకు బ్యాంకు ద్వారా రుణాలను ఇప్పించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పడం వారి మోసానికి నిదర్శనమని మండిపడ్డారు.

ప్రాజెక్టులను గాలికి వదిలేశారు

ఇరిగేషన్ విషయంలో ఆర్థిక మంత్రి మొదటి బడ్జెట్ లో ఆశల ఆనకట్టలు కట్టారని హరీశ్ గుర్తుచేశారు . తుది దశలో ఉన్న ప్రాజెక్టులు, ఆయకట్టు తక్షణం పెంపొందించేలా 6 ప్రాజెక్టులను మొదటి ఆర్థిక సంవత్సరంలో, 12 ప్రాజెక్టులను ఆ తర్వాత వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయడానికి నాడు నిర్ణయించి.. నేడు గాలికి వదిలేశారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 202425లో 6,55,895 ఎకరాలు.. 202526లో 5,05,000 ఎకరాలు అభివృద్ధి చేస్తామని హామీలిచ్చారని, మీరు ఇస్తామన్న ఆ 11,60,895 ఎకరాల ఆయకట్టు ఏమైందని ప్రశ్నించారు.

అన్నివర్గాలకు కాంగ్రెస్ మోసం

బడ్జెట్ కేటాయింపుల్లో అన్నివర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. 2024-25 బడ్జెట్ అంచనాలు, వాస్తవ ఖర్చుల మధ్య వ్యత్యాసం రూ.59,231 కోట్ల (20.3 శాతం) ద్రవ్యలోటు (డెఫిసిట్) ఉంటే దీన్ని రియలిస్టిక్ బడ్జెట్ అంటారా? అని ప్రశ్నించారు. 202627 బడ్జెట్ అంచనాలు, గత ఖర్చుల కంటే 74 వేల కోట్లు ఎకువ అని, 10.7 శాతం గ్రోత్ వస్తది అనుకున్నా, రూ.2.75 లక్షల నుంచి రూ.2.80 లక్షల కోట్ల మధ్య యాక్చువల్స్ రావడమే కష్టమని పేర్కొన్నారు. అంటే ఈసారి కూడా బడ్జెట్ లో సుమారు రూ.45 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్ల లోటు ఉండబోతున్నదని చెప్పారు. 'వాస్తవిక బడ్జెట్ అని భ్రమలు కల్పించడం తప్ప వాస్తవంగా మీరు చేస్తున్నదేమిటి? భట్టిగారూ' అని నిలదీశారు. పథకాల కోతలు తప్ప కాంగ్రెస్ సర్కార్ ఏమీ చేయడం లేదని మండిపడ్డారు.

'యంగ్ ఇండియా' వెయ్యి కోట్ల స్కామ్

'యంగ్ ఇండియా స్కూల్స్ టెండర్లలో వెయ్యి కోట్ల స్కామ్ జరిగింది. ముఖ్యమంత్రి నుంచి మొదలుకొని మంత్రుల నియోజకవర్గాల వరకు 4.56 శాతం నుంచి 4.96 వరకు ఎక్సెస్‌కు ఖరారు కావడమే ఇందుకు నిదర్శనం' అంటూ హరీశ్‌రావు ఆరోపించారు. బడ్జెట్ లో 105 స్కూల్స్ నిర్మిస్తున్నామని గొప్పగా చెప్పి 76 మాత్రమే మంజూరు చేశారని, అధికార, ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కేటాయించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను విస్మరించడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. స్కూల్స్ టెండర్లలో గోల్‌మాల్‌పై సిట్ లేదా ఏసీబీతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

డీ లిమిటేషన్ ఆయితే 50 సీట్లు మహిళవే

- మహిళలు ప్రపంచ జనాభాలో సగం
- కాంగ్రెస్‌లో కష్టానికి గుర్తింపు ఉంటుంది
- పదవులు వాటంతట అవే లభిస్తాయి
- పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: రాష్ట్రంలో డిలిమిటేషన్ జరిగితే 50 దాకా సీట్లు మహిళలకు వస్తాయని పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్ లో సోమవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మొదటి కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన జరిగిన సనావేశంలో ముఖ్య అతిథిలుగా టిపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కష్టానికి గుర్తింపు ఉంటుందని, అంకితభావం, ఫలితాలు కనబరిచే వారికే పదవులు వాటంతట అవే లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. మహిళా నాయకులు తమ పదవులను కేవలం హోదాలుగా చూడకుండా, పార్టీ అభివృద్ధికి ఒక గొప్ప బాధ్యతగా స్వీకరించాలని ఆయన కోరారు. శాసనసభలలో మహిళలకు భవిష్యత్తులో గణనీయమైన అవకాశాలు ఉన్నాయని, రిజర్వేషన్లు ఒక పునాదిని అందిస్తుండగా, బలమైన, సమర్థులైన మహిళా నాయకులకు మరిన్ని సీట్లు ఇవ్వడానికి పార్టీ కట్టుబడి ఉందని ఆయన అన్నారు. స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయాలని, యువతను ప్రోత్సాహించాలని అన్నారు. జిల్లా నుండి నలుగురు లేదా ఐదుగురిని నామినేటడ్ పదవుల్లో స్థానం కల్పిస్తాం అని అన్నారు. ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ లో నాయకులు మర్యాదలు ఇచ్చి పుచ్చుకోవాలని, కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టి, మహిళా సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తామని అన్నారు. మహిళలు పురుషులలో సగ భాగం. మన హక్కుల కోసం మనం పోరాడాలి. ఈ కార్యక్రమ్మలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య , జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా శాసనమండలి, శాసనసభ ప్రభుత్వ విప్‌లు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో జరిగిన రైతు ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రైతు భరోసా మొదటి విడతగా విడుదల చేసిన నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.
-ప్రతిపక్షం, హైదరాబాద్

క్యూనెట్ కేసులో 32 మంది అరెస్ట్

- భారీగా ఒప్పంద పత్రాలు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం
- క్యూనెట్‌పై తెలంగాణలో 68, హైదరాబాద్‌లో 22 కేసులు -
- ఉద్యోగులే లక్ష్యంగా ఇలాంటి మోసాలు
- అప్రమత్తంగా ఉండాలి: సీపీ సజ్జనార్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: పిరమిడ్ తరహాలో మల్టీలెవల్ మార్కెటింగ్ చేస్తూ అధిక లాభాలు వస్తాయని అమాయకులను మోసం చేస్తున్న క్యూనెట్ సంస్థపై పోలీసులు మరోసారి కొరడా ఝుళిపించారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వివరాలను మీడియా సమావేశంలో సీపీ సజ్జనార్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా అనేక మందిని బురిడీ కొట్టించి కోట్ల రూపాయలు మోసం చేసిన క్యూనెట్ సంస్థ కేసులో 32 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి వారిని అరెస్టు చేసినట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. క్యూనెట్ పై తెలంగాణలో 68, హైదరాబాద్‌లో 22 కేసులు ఉన్నట్టు ఆయన చెప్పారు. మొత్తం 27చోట్ల సోదాలు చేసి 32 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో 11మంది మహిళలు ఉండగా నిందితుల నుంచి భారీగా ఒప్పంద పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

హెల్దీఫుడ్స్‌తయారీ పేరిట ట్రాప్

వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్స్, హెల్దీఫుడ్స్‌తయారీ పేరిట ప్రజల్లోకి వెళ్తూ వారిని ట్రాప్‌లోకి దించుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే లక్ష్యంగా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వారికి ప్రొడక్టు చూపించి అదనపు ఆదాయం పేరుతో ట్రాప్ చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగస్థులు పెట్టుబడి పెట్టడానికి డబ్బులు లేకపోతే వాళ్లే ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా ఇప్పించి అధికంగా డబ్బులు వసూలు చేశారని వెల్లడించారు. మోసపోయిన ఉద్యోగుల్లో ప్రముఖ ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న వాళ్లే అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఇలాంటి వాటికి ఎవరైనా పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే వీర్లపల్లి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. గాంధీ భవన్లో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, మంత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ రావత్, మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, సీనియర్ నేతలు వి. హనుమంతరావు, మధుయాష్కి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీసీ సెల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌కు అభినందనలు తెలిపారు. “33 జిల్లాల్లో బలహీన వర్గాలను సంఘటితం చేయాలి.. పార్టీ నుంచి ప్రభుత్వానికి సూచనలు అందిస్తూ వారి హక్కుల కోసం పోరాడాలి” అని సూచించారు. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు ఢిల్లీ స్థాయిలో పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ “బీసీల్లో ఐక్యత లేకపోతే ఏదీ సాధ్యం కాదు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీ ముఖ్యమంత్రి రావడం ఖాయం” అని పేర్కొన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పిస్తూ “బీసీలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే” అని స్పష్టం చేశారు. కుల సర్వేతో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ తనపై ఉన్న నమ్మకంతో ఇచ్చిన పదవికి వన్నె తీసుకొస్తానని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పార్టీగా గుర్తింపు ఉందని, ఇంకా బీసీలకు పార్టీని తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీల సాధికారతపై దృష్టి సారించిందని,రాబోయే ఎన్నికల్లో మరింత బలంగా ముందుకు వెళ్లాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, సీనియర్ నాయకుడు కాశీనాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, రఘు నాయక్ పాల్గొన్నారు.

ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి సమర్థనీయమే

- రైతుల ప్రయోజనార్థమే బియ్యానికి గ్లోబల్ బ్రాండ్ గా ప్రోత్సాహం
- 22,750 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చరిత్రాత్మక విజయం
- ఎగుమతులపై దృష్టి మరల్చేందుకే హరీష్ రావు ఆరోపణలు
- తన అనుచరిడికి అవకాశం ఇవ్వాలని హరీష్ ఒత్తిడి తెచ్చారు
- పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: ఫిలిప్పీన్స్ కు తెలంగాణా రాష్ట్రం నుండి బియ్యం ఎగుమతి ముమ్మాటికీ సమర్థనియమైనదే నని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. తెలంగాణా రైతుల ప్రయోజనార్థమే ఇక్కడి బియ్యానికి గ్లోబల్ బ్రాండ్ గా ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుండి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం తెలంగాణా రాష్ట్రం నుండి 22,750 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేసిన తెలంగాణా ప్రభుత్వం చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసుకుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం రాష్ట్ర శాసన సభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో బియ్యం ఎగుమతుల అంశాన్ని బీఆర్ఎస్ ఉప నాయకుడు లేవనెత్తుతూ ప్రభుత్వంపై చేసిన విమర్శలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. హరీష్ రావు కోరుతున్నట్లు హౌస్ కమిటినే నియమిస్తే ఆయన మంత్రిగా ఉన్న ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలను పరిశీలించేందుకే పరిమితం చేయాలి అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపట్టిన ఎగుమతుల కార్యక్రమాన్ని దృష్టి మరల్చేందుకే హరీష్‌రావు ఆరోపణలకు పునుకుంటున్నారని, వాస్తవానికి హరీశ్ రావే పౌర సరఫరాల శాఖా కమిషనర్ ను సంప్రదించి బియ్యం ఎగుమతులలో తనకు అనువైన అనుచరిడికి అవకాశం ఇవ్వాలి అంటూ వత్తిడి తెచ్చారని ఆయన ఆరోపించారు. నిజాలు ఇలా ఉండగా సభను రాష్ట్ర ప్రజలను తప్పు దోవ పట్టించే విదంగా ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హరీశ్ రావు పై విరుచుకు పడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణా బియ్యాన్ని ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్ర పౌర సరఫరాల శాఖాపై 13 కోట్ల భారం తప్పినట్లైందని స్పష్టం చేశారు. ఎగుమతులతో తెలంగాణా బియ్యానికి భారీగా డిమాండ్ పెరిగి భారతదేశంలోనే అత్యధికంగా క్వింటా ఒక్కంటికి 3600 ధర పలికిందని ఆయన వెల్లడించారు. 2025-26లో ఓపెన్ మార్కెట్ స్కీమ్ కింద భారత ఆహార సంస్థ వేలం నిర్వహిస్తే 3,000 రూపాయల ధర పలకలేదని ఆయన గుర్తు చేశారు. ఛత్తీస్ ఘడ్ లో క్వింటాకు 1800 నుండి 1900 వరకే ధర పలికాయాన్నారు. అంతర్జాతీయ కొనుగోలు దారులతో తెలంగాణా బియ్యం ఎగుమతుల ప్రక్రియలో ఇక్కడి ప్రభుత్వం అక్కడి ప్రభుత్వ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి ఆయా దేశాల కొనుగోలు దారులతో ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు హరీష్ రావు లేవనెత్తిన అపోహలకు తావు ఉండనే ఉండదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్దేశిత లక్ష్యం 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాం కొనుగోలుకు పరిమితము అయినప్పటికీ తెలంగాణా రైతుల నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వెనకడుగు వేయడం లేదన్నారు.

కోర్టు ధిక్కరణను ఉపేక్షించేది లేదు

- తెలంగాణ ఫైనాన్స్ సెక్రటరీపై హైకోర్టు ఆగ్రహం
- కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కాకపోవడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- హైకోర్టును ఆశ్రయించిన రిటైర్డ్ ఉద్యోగులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: తెలంగాణ ఫైనాన్స్ సెక్రటరీపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరితగతిన చెల్లించాలని గత ఏడాది ప్రభుత్వానికి, ఫైనాన్స్ సెక్రటరీకి హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. అయినా కూడా బకాయిలు చెల్లించకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద రిటైర్డ్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం వ్యక్తి గతంగా విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని ఫైనాన్స్ సెక్రటరీకి గతంలో హైకోర్టు ఆదేశించింది. కోర్టుకు వ్యక్తిగతంగా ఫైనాన్స్ సెక్రటరీ హాజరు కాకపోవడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రోజు విచారణకు హాజరు కావాల్సిందేనని సెక్రటరీని హైకోర్ట్ ఆదేశించింది. అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున ఆయన హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరుపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. హైకోర్టు స్పందిస్తూ.. ‘ఈరోజు అర్ధరాత్రి వరకు కోర్టు హాలులోనే ఉంటాము. వ్యక్తిగత హాజరుకు ఎట్టి పరిస్థితుల్లో మినహాయింపు ఇచ్చే ప్రసక్తి లేదు. ఏడాది క్రితమే బకాయిలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చాము’.. ‘కోర్టు ధిక్కరణ కింద నోటిసులు ఇచ్చి ఆరు నెలలు అయింది. ఈ కాలంలోనే పదుల సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు మరణించినట్లు వార్తలు వచ్చాయి. అసెంబ్లీ సమావేశాలు ఉన్నట్లు ఆర్థిక శాఖ కార్యదర్శికి ముందే తెలుసు కదా ?. ముందే న్యాయస్థానం అనుమతి తీసుకోవాల్సి ఉండేది. కోర్టు ధిక్కరణ అంశాలను ఉపేక్షించేది లేదు’ అని స్పష్టం చేసింది.

రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు

- రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధుల విడుదల
- తొలి విడతగా రూ.3,590 కోట్లు జమ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ అవుతుతున్నాయి. యాసంగి సీజన్‌కు సంబంధించి పంటల పెట్టుబడి కోసం తెలంగాణ ప్రభుత్వం మొదటి విడతలో 68,89,955 మంది రైతులకు రూ.3,446.94 కోట్ల రైతు భరోసా నిధులను ఆదివారం విడుదల చేసింది. సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి ల్యాప్‌టాప్‌లో బటన్ నొక్కి నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. మొదటి విడతలో ఎకరం వరకు భూమి ఉన్న వారిని పరిగణనలోకి తీసుకొని 57,44,907.19 ఎకరాలకు ఈ సాయం విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఎకరాకు రూ.6 వేల చొప్పున నిధులను విడుదల చేశారు. నిధుల్లో అత్యధికంగా నల్గొండ జిల్లాలో 5,22,313 మంది రైతులకు రూ.268.57 కోట్లు విడుదల అయ్యాయి. అత్యల్పంగా మేడ్చల్ జిల్లాలో 24,935 మంది రైతులకు రూ.10.43 కోట్లు రిలీజ్ అయ్యాయి. సోమవారం ఉదయం నుంచి రైతుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయని, ఆ మేరకు బ్యాంకుల నుంచి మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఎకరం వరకు భూమి ఉండి, రైతు భరోసా నిధులు జమ కాని వారు సంబంధిత వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు. రెండో విడతగా 20 రోజుల అనంతరం రూ.2,650 కోట్లు, తర్వాత మూడో విడతగా రూ.2,760 కోట్లను విడుదల చేస్తారు.

సత్వరమే ఫిర్యాదులు పరిష్కరించాలి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

ప్రతిపక్షం, రంగారెడ్డి జిల్లా, మార్చి 23 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 53 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం

- మాగంటి గోపీనాథ్ కుమార్తెలకు గాయాలు
- పెద్ద కూతురు పరిస్థితి విషమం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెండో కుమార్తె

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 23: హైదరాబాద్ శివార్లలోని ఔటర్ రింగ్ రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జూబ్లీహిల్స్ దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుమార్తెలు అక్షర (23), దిశీర (19) తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు కారులో ప్రయాణిస్తున్న అభిరామ రెడ్డి, డ్రైవర్ అరికపూడి దుర్గా సాయి కూడా గాయాలపాలయ్యారు. పెద్ద కుమార్తె అక్షర పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ఆమెకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. చిన్న కుమార్తె దిశీరకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసుపత్రికి చేరుకుని, అక్షర ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందగానే నార్సింగి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గచ్చిబౌలి వైపు వస్తుండగా నార్సింగి సమీపంలో ఈ ఘటన జరిగింది. రోడ్డుపై ముందు వెళ్తున్న ఒక డీసీఎం వాహనాన్ని మాగంటి గోపీనాథ్ కుమార్తెలు ఉన్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. బాధితులను వెంటనే గచ్చిబౌలిలోని ఏఐజి హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అక్కడ వారికి అత్యవసర వైద్య చికిత్స కొనసాగుతోంది. నార్సింగి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కారు అతివేగం కారణంగానే నియంత్రణ కోల్పోయి డీసీఎంను ఢీకొట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి తిరిగి వస్తున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది

ఐపీఎల్‌లో ‘ఇంపాక్ట్ ప్లేయర్’ రూల్ నాకు నచ్చదు. అది ఆల్‌రౌండర్ల పాత్రను పరిమితం చేస్తుంది. అయితే నిబంధనలను పాటించాల్సిందే. ఈ రూల్ రాకముందు బ్యాటింగ్, బౌలింగ్ కోసం ఆల్‌రౌండర్‌ను ఆడించేవారు. ఇప్పుడు అవసరాన్ని బట్టి ఒక స్పెషలిస్ట్ బ్యాటర్‌ను లేదా బౌలర్‌ను మార్చుకోవడం వల్ల ఆల్‌రౌండర్ల అవసరం తగ్గిపోతోంది.
- డీసీ కెప్టెన్ అక్షర్ పటేల్

ఓపెన్ వాయిస్

అగ్రరాజ్యం 'అడుగు' వెనక్కి!

అంతర్జాతీయ రాజకీయ యవనికపై అగ్రరాజ్యం అని పిలవబడే అమెరికా అహంకారం మరోసారి మట్టికరిచినట్లు కనిపిస్తోంది. ప్రపంచ పోలీస్ అని విర్రవీగే డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తానంటూ చేసిన ప్రగల్భాలు ఇప్పుడు నీటి మూటలయ్యాయి. ఇరాన్ గడ్డపై చేయి వేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న టెహ్రాన్ హెచ్చరికల ధాటికి, వైట్ హౌస్ తన దూకుడును తగ్గించుకోవడం గమనార్హం. ఇది కేవలం వ్యూహాత్మక వెనకడుగు కాదు, ఇరాన్ రక్షణ శక్తి ముందు అగ్రరాజ్యం అశక్తతకు నిదర్శనం అని ఇరాన్ అధికారిక మీడియా ఐఆర్ఐబి (IRIB) ఘాటుగా విశ్లేషిస్తోంది. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో అమెరికా గుత్తాధిపత్యానికి పగుళ్లు పడుతున్నాయని చెప్పడానికి ఒక నిఖార్సైన ఉదాహరణ. ఒక దేశం యొక్క మౌలిక సదుపాయాలను, ముఖ్యంగా సామాన్యుల జీవితాలతో ముడిపడి ఉన్న విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించడం ట్రంప్ నైతిక దిగజారుడుతనానికి పరాకాష్ట. యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో సైనికుల మధ్య జరిగేది కాదు, అది దేశ ఆర్థిక వెన్నెముకను విరిచే కుట్రగా అమెరికా భావించింది. ఒక దేశాన్ని అంధకారంలోకి నెట్టడం ద్వారా ఆ దేశ ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీయవచ్చని ట్రంప్ భావించి ఉండవచ్చు. కానీ, ఇరాన్ ఈ బెదిరింపులకు బెదరలేదు. తమ దేశ సార్వభౌమాధికారంపై దాడి జరిగితే, అది అమెరికా ప్రయోజనాలకు ప్రపంచవ్యాప్తంగా సమాధి కడుతుందని ఇరాన్ రాయబార కార్యాలయాలు స్పష్టం చేశాయి. ఈ హెచ్చరికల వెనుక ఉన్న నిఖార్సైన సైనిక సన్నద్ధతను చూసి ట్రంప్ బృందం అప్రమత్తమైంది. అగ్రరాజ్యం వేసే ప్రతి అడుగుకు ప్రతిగా ఇరాన్ క్షిపణులు సిద్ధంగా ఉన్నాయని గ్రహించిన తర్వాతే ట్రంప్ తన వ్యాఖ్యల నుండి వెనక్కి తగ్గారు. అఫ్ఘానిస్థాన్‌లోని ఇరాన్ ప్రతినిధులు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ తన ప్రకటన నుండి వెనక్కి తగ్గడం అనేది అంతర్జాతీయ సమాజం ముందు ఆయనకు జరిగిన ఘోర పరాభవం. ఒకవైపు ఇజ్రాయెల్‌కు వత్తాసు పలుకుతూ మధ్యప్రాచ్యాన్ని అగ్నిగుండంగా మారుస్తున్న అమెరికా, ఇరాన్ విషయంలో మాత్రం ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోంది. ఇరాన్ వద్ద ఉన్న అధునాతన క్షిపణి వ్యవస్థ, డ్రోన్ టెక్నాలజీ అగ్రరాజ్యానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ కేంద్రాలపై ఒక్క దాడి జరిగినా, దానికి ప్రతిగా పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా నౌకాదళం నామరూపాలు లేకుండా పోతుందన్న భయం ట్రంప్‌ను వెంటాడి ఉండవచ్చు. ఇది అమెరికా యొక్క బలహీనతను మాత్రమే కాకుండా, ఇరాన్ యొక్క ప్రతిఘటన శక్తిని ప్రపంచానికి చాటిచెప్పింది. ఏ దేశమైనా సరే, తన రక్షణ కోసం ప్రాణాలకైనా తెగిస్తుందని ఇరాన్ నిరూపించింది. దశాబ్దాలుగా పశ్చిమ దేశాల ఆంక్షలను తట్టుకుని, తన స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటున్న ఇరాన్, ఇప్పుడు దౌత్యపరంగా కూడా అమెరికాను ఇరకాటంలో పెట్టింది. విద్యుత్ కేంద్రాలపై దాడి అనేది యుద్ధ నేరం కిందకు వస్తుందని ఐక్యరాజ్యసమితి వేదికగా అమెరికాను ఎండగట్టడంలో ఇరాన్ విజయం సాధించింది. ట్రంప్ ప్రకటన వెనక్కి తీసుకోవడం అనేది కేవలం మాటల మార్పు కాదు, అది ఇరాన్ రక్షణ కవచం ముందు అమెరికా ఆయుధ బలహీనతకు నిదర్శనం. అమెరికా తన గుత్తాధిపత్యాన్ని ప్రదర్శించాలని చూసిన ప్రతిసారీ, ఇరాన్ వంటి దేశాలు గట్టి ఎదురుదాడితో బుద్ధి చెబుతూనే ఉన్నాయి. అగ్రరాజ్యాలు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి చేసే ప్రయత్నాలు చిన్న దేశాల ఐక్యత ముందు పని చేయవని ఇక్కడ స్పష్టమవుతోంది. మధ్యప్రాచ్యంపై పట్టు కోసం అమెరికా ఆడుతున్న నాటకాలు ఇక సాగవని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ట్రంప్ వెనక్కి తగ్గడం అనేది ప్రపంచ శాంతికి తాత్కాలికంగా శుభపరిణామమే అయినప్పటికీ, ఇది అగ్రరాజ్య బలహీనతను ఎండగట్టింది. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చి, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని బెదిరించే 'రౌడీయిజం' ఇకపై చెల్లదు. ఇరాన్ చూపిన తెగువ, హెచ్చరించిన తీరు అగ్రరాజ్యానికి ఒక గుణపాఠం కావాలి. ఒక దేశం యొక్క ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తామన్న అహంకారపూరిత వ్యాఖ్యలు చేసే ముందు, ఆ దేశం యొక్క ఆత్మగౌరవాన్ని తక్కువ అంచనా వేయకూడదని ట్రంప్ తెలుసుకోవాలి. అగ్రరాజ్యం తన అహంకారాన్ని వీడి, ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకపోతే, భవిష్యత్తులో మరిన్ని పరాభవాలు తప్పవని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ సాధించిన ఈ దౌత్యపరమైన విజయం, ప్రపంచవ్యాప్తంగా అగ్రరాజ్యాల పీడనను ఎదుర్కొంటున్న దేశాలకు ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
24.03.2026

తమిళనాట టఫ్ ఫైట్

పొలిటికల్ సర్కిల్స్ డిస్కషన్ ప్రకారం..కొత్తగా రాజకీయ రణరంగంలోకి దిగిన విజయ్ టీవీకే పార్టీ బలమైన ప్రభావం చూపడమే కాదు.. కింగ్ మేకర్‌గా నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దివంగత జయలలిత నెచ్చెలిగా పేరున్న వీకే శశికళ కొత్త పార్టీ 'ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం' కొబ్బరి తోటను పార్టీ గుర్తుగా ప్రకటించి, అన్నాడీఎంకే కేడర్‌ను తన వైపు తిప్పకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈమె ఆచరణలో అన్నాడీఎంకే ఓట్లను ఏ మేరకు చీలుస్తారనేది చూడాలి. అయితే, తమిళనాడులో ఈసారి ఎన్నికలు అత్యంత రసవత్తరంగా ఉండనున్నాయనేది మాత్రం స్పష్టమౌతోంది.

తాళ్లపల్లి నవీన్
99516 23740

దక్షిణ భారతదేశంలో అత్యంత బలమైన రాష్ట్రంగా ఉన్న తమిళనాడులో పాగా వేయాలని జాతీయ పార్టీలు చాలా కాలం నుంచి ప్రత్యేకమైన దృష్టి సారిస్తున్నాయి. కానీ, ఈ స్టేట్‌లో బలమైన పక్షాలుగా ఉన్న ద్రావిడ పక్షాల రాజకీయ ఆధిపత్య పోరు ఫలితంగా జాతీయ పార్టీలు అంతగా ఆదరణకు నోచుకోలేకపోతున్నాయి. 224 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఈసారి జరగబోయే ఎన్నికలు అత్యంత కీలకం కానున్నాయి. గతానికి భిన్నంగా ఈ సారి రాజకీయ పక్షాల మధ్య వెరీ టఫ్ ఫైట్ ఉండనుంది. ఎన్నికల రణక్షేత్రంలో ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది. అధికార డీఎంకే తన పీఠాన్ని కాపాడుకోవాలని చూస్తుంటే, అన్నాడీఎంకే, బీజేపీ కూటమి కూడా అధికారాన్ని చేజిక్కించుకోవాలని అస్త్రశస్త్రాలు సిద్ధం చేస్తున్నది. మరోవైపు, సినీ సూపర్ స్టార్ విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ, శశికళ కొత్త పార్టీ కూడా అక్కడి రాజకీయ సమీకరణాలను మార్చివేస్తున్నాయి.

రంగంలోకి పీఎం

అధికార పార్టీ డీఎంకే తమ సంక్షేమ పథకాలు, ద్రావిడ సిద్ధాంతం ప్రాతిపదికన మళ్లీ గెలుస్తామనే ధీమాతో ఉంది. సీఎం స్టాలిన్ నాయకత్వంలో పార్టీ యంత్రాంగం క్షేత్రస్థాయిలో బలంగా పని చేస్తున్నది. ఆటు ప్రధాన ప్రతిపక్షం అన్నా డీఎంకే, కేంద్రంలోని అధికార పార్టీ బీజేపీతో జతకట్టి డీఎంకే వైఫల్యాలను ఎండగడుతున్నది. పీఎం నరేంద్రమోడీ స్వయంగా ఫుల్ ఫోకస్ పెట్టారు. తమిళనాడు పర్యటనలు చేస్తూ, కొత్త ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. తమిళ సంస్కృతిని, భాషను ప్రస్తావిస్తూ బీజేపీ బలాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కాషాయ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమన్వయంతో సరికొత్త ఉత్సాహంతో ముందుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. కమలనాథులు నూతనోత్సాహంతో పని చేస్తూ ఈ సారి సత్తా చాటాలని బలంగా శ్రమిస్తున్నారు. జనంలోకి వెళ్తూ.. జనం మది దోచుకుని కమలం గుర్తుకు ఓట్లు పడేలా ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు.

'విజయ' అవకాశాలు

ఇప్పటి వరకు తమిళనాట ద్విముఖంగా ఉన్న పోటీని త్రిముఖంగా మారుస్తూ.. ప్రముఖ సినీ నటుడు విజయ్.. బలంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. సైద్ధాంతికంగా బీజేపీ, రాష్ట్రంలో డీఎంకేతో తన ఫైట్‌ను ప్రకటించిన విజయ్.. తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడిగా రాజకీయ అరంగేట్రం అనంతరం.. తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. వ్యవస్థలో 'మార్పు'ను తీసుకొచ్చేందుకు అధికార 'మార్పు' జరగాలనే బలమైన సంకేతాన్ని ప్రజల్లోకి పంపుతున్నారు. సహజంగానే ఆయనకున్న సినీ ఛరిష్మా సభలకు జనం రావడంలో దోహదపడుతున్నది. కానీ, అభిమానులు ఓటు బ్యాంకుగా మారి టీవీకే అధినేత

విజయ్‌ను అధికారంలోకి తీసుకురాగలరా? అనేది ప్రజలే తేల్చాలి.

అన్నివర్గాల మెప్పు 'టీవీకే' టార్గెట్

ముఖ్యంగా మహిళా ఓటర్లే లక్ష్యంగా విజయ్ వరాల జల్లు కురిపించారు. అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, ప్రస్తుత ప్రభుత్వం కొన్ని బస్సులకే పరి మితం చేసిన ఉచిత ప్రయాణాన్ని, తాము అధికారంలోకి వస్తే అన్ని రకాల ప్రభుత్వ బస్సులకు వర్తింపజేస్తామని, ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం 8 గ్రాముల బంగారం, పట్టుచీర అందజేసే 'అన్న విజయ్ సాయం' పథకం ఆకర్షిస్తున్నది. ప్రతి కుటుంబానికి ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం సామాన్యుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లల తల్లులకు లేదా సంరక్షకులకు ఏడాదికి రూ.15,000 ఆర్థిక సాయం 'కామరాజార్ కల్వి ఉరుత్తి ఉత్తమ్' పేరిట ఇస్తామంటున్నారు. 'రాణి వేలు నాచాయర్ ఫోర్సెస్' పేరుతో ప్రత్యేక మహిళా పోలీసు విభాగం ఏర్పాటు, రాష్ట్రవ్యాప్తంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో బాడీ కెమెరాలతో కూడిన 500 బృందాలను నిరంతరం పర్యవేక్షణ కోసం నియమిస్తాని చెబుతున్నారు. ప్రజా రవాణా వ్యవస్థలో మహిళల భద్రతకు భరోసా కల్పిస్తూ స్మార్ట్ పానిక్ బటన్లను ఏర్పాటు చేస్తామని, బటన్ నొక్కిన 5 నిమిషాల్లోనే కమాండ్ కేంద్రం నుంచి స్పందన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చీకటి ప్రాంతాల్లో వెలుతురు, సీసీటీవీ నిఘా పెంచేలా 'జీరో డార్క్ స్పాట్స్' అనే కార్యక్రమం చేపడుతామని చెబుతున్నారు. ఇక రైతులకూ ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నట్టు విజయ్ పేర్కొంటున్నారు. రైతులకు రుణమాఫీ వంటి హామీలు గ్రామీణ ఓటర్లలో టీవీకే పట్ల సానుకూలతను పెంచుతున్నాయి. కేవలం ఉచిత పథకాలే కాకుండా, వ్యవస్థాగత మార్పులకు కూడా ప్రాధాన్యం ఇస్తామని విజయ్ తన ఎన్నికల ప్రసంగాల్లో పేర్కొంటున్నారు. పేద రైతులకు రుణమాఫీనే కాకుండా ఉచిత విద్య విషయమై కీలక హామీని విజయ్ ఇస్తున్నారు. రెండెకరాల కంటే తక్కువ భూమి కలిగిన రైతులు, భూమిలేని కుటుంబాలకు చెందిన పిల్లలకు ఇంజినీరింగ్, మెడిసిన్ సహా ఉన్నత, సాంకేతిక విద్య పూర్తిగా అందిస్తామని ప్రామిస్ చేస్తున్నారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులు తీసుకున్న పంట రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని చెబుతున్నారు. మొత్తంగా తమిళనాట ప్రస్తుతమున్న పొలిటికల్ సర్కిల్స్ డిస్కషన్ ప్రకారం..కొత్తగా రాజకీయ రణరంగంలోకి దిగిన విజయ్ టీవీకే పార్టీ బలమైన ప్రభావం చూపడమే కాదు.. కింగ్ మేకర్‌గా నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దివంగత జయలలిత నెచ్చెలిగా పేరున్న వీకే శశికళ కొత్త పార్టీ 'ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం' కొబ్బరి తోటను పార్టీ గుర్తుగా ప్రకటించి, అన్నాడీఎంకే కేడర్‌ను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈమె ఆచరణలో అన్నాడీఎంకే ఓట్లను ఏ మేరకు చీలుస్తారనేది చూడాలి. అయితే, తమిళనాడులో ఈసారి ఎన్నికలు అత్యంత రసవత్తరంగా ఉండనున్నాయనేది మాత్రం స్పష్టమౌతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అన్నాడీఎంకే కూటమి, అధికార డీఎంకే కూటమి, ప్రత్యామ్నాయంగా వస్తున్న సినీ హీరో విజయ్ టీవీకేలో తమిళనాడు ప్రజలు.. ఈసారి ఎవరికి పట్టం కడుతారు? మార్పును కోరుకుంటున్నారా అనేది వేచి చూడాలి.

(విశ్లేషకులు జర్నలిస్ట్)

మనసు మోసే భారాలు
కౌన్సిలింగ్‌తో మారుతున్న జీవితాలు

బి. హర్ష వర్ధన్
M.Sc. PhD.

మనిషి జీవితంలో కనిపించని గాయాలే అత్యంత ప్రమాదకరమైనవి. శరీరానికి గాయం అయితే నొప్పి బయటపడుతుంది, కానీ మనసుకు గాయం అయితే అది లోపలే ముడుచుకుపోతుంది. ఈ రోజుల్లో ప్రపంచం వేగంగా ముందుకు దూసుకుపోతున్నా, మనిషి మనసు మాత్రం వెనుకబడుతోంది. ఒత్తిడి, పోటీ, ఆర్థిక అస్థిరత, సంబంధాల సంక్షోభం—ఇవి కలిసి ఒక నిశ్శబ్ద సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. ఇది ఒక వ్యక్తిగత సమస్య కాదు. ఇది ఒక సామాజిక, ఆర్థిక, మానవీయ సంక్షోభం. ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్యం ఇప్పుడు అత్యంత కీలక ప్రజారోగ్య సమస్యగా మారింది. శారీరక రోగాలకంటే కూడా దీని ప్రభావం విస్తృతంగా, నిశ్శబ్దంగా వ్యాపిస్తోంది. ఆర్థిక ఒత్తిడి, సామాజిక మార్పులు, టెక్నాలజీ ఆధారిత జీవనశైలి, వ్యక్తిగత సంబంధాల లోపం—ఇవి కలిసి మానసిక సంక్షోభాన్ని పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో సైకాలజికల్ కౌన్సిలింగ్ మరియు సైకోథెరపీ ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రధాన పరిష్కార పద్ధతిగా ఎదుగుతున్నాయి.

ప్రపంచ మానసిక ఆరోగ్య స్థితి:

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) 2023 అంచనాల ప్రకారం, ప్రపంచ జనాభాలో సుమారు 970 మిలియన్ మంది (దాదాపు ప్రతి 8 మందిలో 1 వ్యక్తి) మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇందులో ముఖ్యంగా: Depression: 280 మిలియన్ మంది, Anxiety Disorders: 301 మిలియన్ మంది Substance Use Disorders (డ్రగ్స్/మద్యం): 164 మిలియన్ మంది, ఇది కేవలం నమోదు అయిన కేసులు మాత్రమే; వాస్తవ సంఖ్యలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. భారతదేశం సందర్భంలో, National Mental Health Survey (2015-16) ప్రకారం, సుమారు 14% భారతీయులు జీవితంలో ఎప్పుడో ఒకసారి మానసిక సమస్యను ఎదుర్కొంటారు. సుమారు 45 మిలియన్ మంది డిప్రెషన్‌తో 38 మిలియన్ మంది ఆంగ్జైటీతో బాధపడుతున్నారు, అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే: ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 700,000 మంది ఆత్మహత్యలు చేస్తున్నారు (WHO, 2023), భారతదేశంలో మాత్రమే సుమారు 1.7 లక్షల మంది (NCRB, 2022) ఆత్మహత్యలు, ఈ గణాంకాలు స్పష్టంగా సూచిస్తున్నాయి... వ్యక్తిగత సమస్య కాదు; ఇది



ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒక సామూహిక సంక్షోభం.

ఒత్తిడుల మూలాలు?

ఈ రోజుల్లో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల మూలం ఒకే పదంలో చెప్పాలంటే— "అసమతుల్యత". ఆశలు ఎక్కువ, అవకాశాలు అనిశ్చితం. ఫలితంగా, మనసులో నిరాశ పెరుగుతోంది. సోషల్ మీడియా ఈ పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ఇతరుల విజయాలు మాత్రమే కనిపిస్తాయి, వారి కష్టాలు కనిపించవు. ఇది పోలికల సంస్కృతిని పెంచింది. "వాళ్లు అంత సాధించగలిగితే నేను ఎందుకు కాదు?" అనే ప్రశ్న "నేను పనికిరాని వాడిని" అనే నమ్మకంగా మారుతోంది. ఇంకో ముఖ్యమైన అంశం—కుటుంబాల్లో కమ్యూనికేషన్ లోపం. చాలా కుటుంబాల్లో ఇంకా భావోద్వేగాలపై ఓపెన్‌గా మాట్లాడే వాతావరణం లేదు. "ఇవి చిన్న విషయాలు" అనే నిర్లక్ష్యం, యువతను మరింత ఒంటరితనంలోకి నెట్టేస్తోంది.

కౌన్సిలింగ్ శాస్త్రీయ పరిష్కారం ...

అది ఒక శాస్త్రీయ ప్రక్రియ. కౌన్సిలింగ్ అంటే కేవలం మాట్లాడటం కాదు, ఇది శాస్త్రీయంగా నిరూపితమైన చికిత్సా విధానం. మన ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన—all interconnected. ఒక మనిషి ఎలా ఆలోచిస్తాడో, అదే అతని భావాలను, ఆ భావాలు అతని చర్యలను ప్రభావితం చేస్తాయి. కౌన్సిలింగ్ ఈ చక్రాన్ని అర్థం చేసుకుని, నెగటివ్ ఆలోచనలను మార్చే ప్రయత్నం చేస్తుంది. ఒక వ్యక్తి "నేను విఫలమయ్యాను" అని భావిస్తే, కౌన్సిలింగ్ అతనికి "ఇది ఒక అనుభవం, ఒక పాఠం" అని చూపిస్తుంది. ఈ చిన్న మార్పు అతని జీవిత దిశను పూర్తిగా మార్చగలదు. Cognitive Behavioral Therapy (CBT) వంటి పద్ధతులు ఈ విధానంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పరిశోధనలు చెబుతున్నాయి—70 నుండి 80 శాతం మంది కౌన్సిలింగ్ ద్వారా గణనీయమైన మెరుగుదల పొందుతున్నారు. ఇది కేవలం భావోద్వేగ స్థాయిలో మాత్రమే కాదు; మెదడు పనితీరులో కూడా మార్పులు కనిపిస్తున్నాయి. అయితే, మన సమాజంలో ఇంకా ఒక పెద్ద సమస్య ఉంది—మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలు. సైకాలజిస్ట్ దగ్గరకు వెళ్లడం అంటే ఇంకా చాలా మంది బలహీనతగా భావిస్తున్నారు. "ఇది మన ఇమేజ్ కి నష్టం" అనే భావన చాలా మందిని చికిత్స తీసుకోకుండా ఆపుతోంది. ఈ ఆలోచన మారాల్సిన అవసరం ఉంది. మానసిక సమస్యలు కూడా ఇతర రోగాల్లాగే ఒక ఆరోగ్య సమస్య. దానికి చికిత్స ఉంది, పరిష్కారం ఉంది.

ప్రభుత్వాలే కాదు... సమాజం కూడ...

ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు కూడా ఇప్పుడు మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టుతున్నాయి. కానీ ఇంకా ఒక పెద్ద గ్యాప్ ఉంది. తక్కువ ఆదాయ దేశాల్లో 75 శాతం మందికి పైగా సరైన చికిత్స అందడం లేదు. భారతదేశంలో మానసిక వైద్య నిపుణుల కొరత కూడా ఒక పెద్ద సమస్య. ఈ పరిస్థితిని మార్చాలంటే, కేవలం ప్రభుత్వాలే కాదు... సమాజం మొత్తం ముందుకు రావాలి. పిల్లలతో మాట్లాడే తల్లిదండ్రులు కావాలి. విద్యాసంస్థల్లో కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉండాలి. యువత తమ భావాలను భయపడకుండా వ్యక్తపరచే వాతావరణం కల్పించాలి. ముఖ్యంగా, "సహాయం కోరడం బలహీనత కాదు" అనే సందేశం ప్రతి ఒక్కరికీ చేరాలి.

(రచయిత కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, హైదరాబాద్)

పరాభవాంత ప్రాభవం!

అంతరిక్షంలో
భ్రమణ పరిభ్రమణలు సత్యం!
అంతరంగంలో
భ్రమ విభ్రమ సంభ్రమలు నిత్యకృత్యం!!

ఓ సహచరా!
ఇది వెలుగు ఉదయం చీకటి రాత్రుల కాలమే అనుకుంటు
న్నావేమో
కానేకాదు...
నిశాంత ఉషోదయాలు సంధ్యాంత అంధకారాలు
సర సరా ప్రాకుకుంటూ
మన లోకి ప్రసరించే కాలం కూడా...

అచ్చంగా విషాదం స్వచ్ఛంగా ఆనందం
మొత్తంగా ఉత్సాహం కుల్లు గుత్తగా ఉదాసీనం
ఎక్కడా ఉండనే ఉండవు!
విషాదాంతమే ఆనందం.. ఆనందాంతమే విషాదం..
భావ అభావ స్వభావ ప్రభావ
పర భావ పరా భావ పరాభవ కాలాలే అన్నీ..!

మనకు మనం బుద్ధిజీవులం అనుకుంటాం కదా..
అందుకే కాలానికి లెక్కలు వేశాం
సమయానికి హద్దులు గీశాం
రుతువులకు పేర్లు పెట్టాం

చిత్రమేంటంటే
మన కన్నా ముందే ఇవన్నీ
ఈ విశ్వంలో చక్రభ్రమణం చేస్తున్నాయి!
మనం అనుకుంటాం
"కనుక్కున్నాను.. కనుక్కున్నాను..
యురేకా! యురేకా!!"అని గొంతు
చించుకుని గంతులు వేస్తాం..
ఓ మానవా! ఇవన్నీ నీ కన్నా పురాతన సంచారులు!
ఈ ప్రపంచానికి తోబుట్టువులు!!

ఇప్పటిదాకా మనం
కొత్త ఉదయాన్ని కిరణాలకే పరిమితం చేశాం
సరికొత్త వెలుగులనీ కన్నులలోనే బంధించాం
కొత్త ఉగాదిని కోయిల పాటలు వేపపూతలకు
తియ్యని భక్షాలు పచ్చడి రుచులకు మాత్రమే అంకితం
చేసాం!

అక్షయ నుండి విరాగి దాకా
ప్రభవ నుండి పరాభవ దాకా ఉగాదులను ఒకే లాగా
ఆహ్వానించాం!

ఇప్పుడిలా కాదు...
పరాభవా!
ఈ సారి నిన్ను కొత్త ఆశలతో పిలుస్తున్నాను..
మమ్మల్ని పరాభవించడానికి కాదు..
మాలో పాతుకుపోయిన
ద్వేషాన్ని, అసహనాన్ని, అసూయను
అన్యాయాలను, అక్రమాలను, ఆకలిని, అత్యాశలను
నిరాశ, నిస్తేజం, న్యూనతలను
యుద్ధోన్మాదాన్ని, ఉగ్రవాదాన్ని, విధ్వంసక
వినాశ ప్రవృత్తిని
పరాభవించమని వేడుకుంటున్నాను!
ఈ పరాభవం
నవ మానవ వైభవానికి ప్రారంభం కావాలని
మామిడి తోరణాలతో సందేశం పంపిస్తున్నాను!

ఇప్పుడు పరాభవాంత ప్రభవాలు
ప్రభావాంత పరాభవాలు
ఒకే సమయానికి రెండు దిక్కులుగా గమనిద్దాం!
అనంత కాలానికి అంచులుగా అంగీకరిద్దాం!!
పరాభవాన్ని ప్రాభవంగా మలచుకుందాం!!!

డాక్టర్
మామిడి హరికృష్ణ

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

బీజేపీ నేతల గృహనిర్బంధం

- 'చలో అసెంబ్లీ'కి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 23 : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ బీజేపీ పిలుపునిచ్చిన 'చలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు మొయినాబాద్ మండల పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం నుంచే మండలంలోని పలువురు ప్రముఖ బీజేపీ నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. హైదరాబాద్ బయలుదేరేందుకు సిద్ధమైన మరికొంతమంది కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తోందని ఈ సందర్భంగా అరెస్టు అయిన బీజేపీ నేతలు మండిపడ్డారు. అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు.

పరిసరాల స్వచ్ఛతను కాపాడాలి

- చెత్త విభజనతోనే పట్టణ పరిశుభ్రత
- మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 23: పట్టణ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల స్వచ్ఛతను కాపాడటంలో భాగస్వాములు కావాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి పిలుపునిచ్చారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ఐదో వార్డు హనుమాన్ నగర్‌లో చెత్త విభజనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని కోరారు. ఇళ్లలో ఉత్పత్తయ్యే చెత్తను తడి, పొడి రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. తడి చెత్తతో విలువైన సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడం ద్వారా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చని వివరించారు.అనంతరం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తయారు చేసిన సేంద్రియ ఎరువును వార్డు ప్రజలకు చూపిస్తూ, మొక్కల పెంపకంలో దాని ప్రాముఖ్యతను వివరించి పంపిణీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బొలిశెట్టి రాజు, పిల్లి తిరుపతి, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డ్ ఆర్.పి వాణిశ్రీ, అంగన్వాడీ టీచర్ తిరుమల, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలి

- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన ఎంపీ అర్వింద్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 23 : నిజామాబాద్ పార్లమెంట్ పరిధి లో రైల్వే ప్రాజెక్టులపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి సోమవారం మరోసారి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఉత్తర తెలంగాణకు సంబంధించిన ముఖ్యమైన రైల్వే ప్రాజెక్టులపై ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ కొన్ని అంశాల్లో ఇంకా నిర్ణయాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో, ఆయన నిజామాబాద్ జంక్షన్‌లో పిట్ లైన్ కోచింగ్ డిపో ఏర్పాటు, పలు రైళ్ల పొడగింపులు అలాగే పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు ఆమోదం వంటి అంశాలు ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. అంతేగాకుండా నవీపేట్, ఇందల్వాయి వద్ద అదనంగా ఆర్ వో బీ లు,నడిచ్ పల్లి, అమ్మక్కపేట వద్ద ఆర్ యూ బీల నిర్మాణాల ప్రక్రియను వేగవంతం చేయాలని, జానకంపేట్ వద్ద ఆర్ యూ బీ విస్తరణ,రైళ్ల పొడిగింపు,నిజామాబాద్,మెట్పల్లి,కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్ మీదుగా తిరుపతికి రైళ్లు, నిజామాబాద్ మీదుగా వందే భారత్ ట్రైన్లను త్వరితగతిన అమలు కావాలని ఎంపీ కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా నిర్ణయాలు తీసుకోవాలని ఎంపీ అర్వింద్ రైల్వే మంత్రి ని కోరారు. కాగా తాను కోరినట్టుగా ఎడపల్లి వద్ద ఆర్ఓబి నిర్మాణం, డిచ్ పల్లి లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు, ఆర్మూర్ ఆదిలాబాద్ రైల్వే లైన్ పనుల మంజూరు పట్ల ఆయన రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు కీలక ముందడుగు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 23 : సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. సోమవారం నుండి సంగారెడ్డి డివిజన్ పరిధిలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగుల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో ప్రయోగాత్మకంగా నమోదు చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇందిరానగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియ, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రోగుల ఆరోగ్య చరిత్రను డిజిటల్ రూపంలో భద్రపరచడం ద్వారా వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించ వచ్చని ఆమె తెలిపారు. నెట్‌వర్క్, టెక్నికల్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ప్రగతిని సమీక్షిస్తూ, సమర్థవంతంగా అమలు చేపట్టాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు ద్వారా రోగుల ఆరోగ్య చరిత్ర, పరీక్షల వివరాలు, చికిత్స సమాచారం అన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత్ రావు,డాక్టర్ శశాంక్, మెడికల్ ఆఫీసర్లు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రతిపక్షం,మొయినాబాద్,మార్చి 23: పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని, వైద్య సేవలను ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు.ఈ క్యాంపులో మొత్తం 368 మంది (మహిళలు 233, పురుషులు 135) పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ లలిత దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూనమ్, ఇతర వైద్య అధికారులు పాల్గొని సేవలందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూనమ్, డిప్యూటీ డాక్టర్ శ్రీనివాస్, చేవెళ్ల డివిజన్ డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడితే నిర్బంధం

- ఇదే కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన
- శ్రీరాములు అందెల

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చ్ 23: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ మండల కేంద్రంలో.. శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచక పాలనకు వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు నాయకత్వంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు ని మీర్పేట్ పోలీసు సిబ్బంది ముందస్తు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అదే ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో బీజేపీ ప్రజా పోరాటాలు కొనసాగిస్తుందని, వాటిని అణచివేయాలని ప్రయత్నిస్తే ప్రజలు అన్నింటినీ గమనిస్తారని ఆయన హెచ్చరించారు.

డయాలసిస్, పాలియేటివ్ కేర్ ను పరిశీలించిన డీసిహెచ్

ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 23 : చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు నిలిచిపోయి రోగులు పడుతున్న ఇబ్బందులపై స్పందించిన డీసిహెచ్ అనురాగిణి సోమవారం స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి డయాలసిస్ సెంటర్, పాలియేటివ్ కేర్ ను పరిశీలించారు. పాలియేటివ్ కేర్ లో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు నివేదికలు పంపడం జరిగిందని, వారం రోజుల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, చేవెళ్ల మాజీ సర్పంచ్, కౌన్సిలర్ బండారి శైలజాఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, కృష్ణానాయక్, ముడిమ్యాల సొసైటీ మాజీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, నాయకులు బుర్ల మహేష్, రాంరెడ్డి, వైద్యులు ఉన్నారు.

రసాయన శాస్త్రంలో ఎస్ఆర్.జితేష్ కుమార్‌కు పీహెచ్‌డీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 23 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఎస్.ఆర్.జితేష్ కుమార్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'హైఫనేటెడ్ విశ్లేషణాత్మక పద్ధతులు, క్యూబీడీ వినియోగించి కోలెసెవెలామ్ హెచ్సీఎల్, బిక్టెగ్రావిర్, ఎల్విటెగ్రావిర్, వోరికోనజోల్ లలో కొత్త మలినాల నిర్ధారణ, ధ్రువీకరణ' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కోటేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ అధ్యయనం, ఉత్పరివర్తన ప్రమాదాలకు సంబంధించిన కీలకమైన భద్రతాపరమైన ఆందోళనలను పరిష్కరిస్తూ, ముఖ్యమైన ఫార్మాస్యూటికల్ మందులలోని నూతన, జన్యువిషపూరిత మలినాలను గుర్తించి, వాటి పరిమాణాన్ని నిర్ధారించడానికి HPLCMS/MS, LCMS, and GCMS వంటి అధునాతన సాంకేతిక పద్ధతులతో పాటు, ప్రయోగాల రూపకల్పన (డీవోఈ), రూపకల్పన ద్వారా నాణ్యత (క్యూబీడీ) సూత్రాలను ఉపయోగిస్తుందని వివరించారు. డాక్టర్ జితేష్ కుమార్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వెంచర్‌లో అసాంఘిక కార్యకలాపాలు

- పోలీస్ నిఘా పెంచాలని గ్రామస్తుల డిమాండ్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి23: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కోళ్ల పడకల్ గ్రామం పరిధిలోని రైస్ మిల్ నుంచి గట్టుపల్లి వెళ్లే దారిలో ఉన్న ఒక వెంచర్ అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉదయం నుంచి రాత్రి వరకు గుంపులుగా చేరుతున్న కొంతమంది యువకులు అక్కడ మద్యం పార్టీలతో పాటు రేవ్ పార్టీలు ,గంజాయి వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.అదేవిధంగా,వెంచర్‌లో ఏర్పాటు చేసిన గదుల్లో కొంతమంది మహిళలను తీసుకువచ్చి అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మామిడి తోటల మధ్య నిర్మానుష్య వాతావరణం ఉండటం వల్ల ఈ ప్రాంతాన్ని ఆకతాయిలు అడ్డాగా మార్చుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.ఇప్పటికే పలుమార్లు రైతులు, గ్రామస్తులు వారిని హెచ్చరించినప్పటికీ,ఒకటి రెండు రోజులు తగ్గిన తర్వాత మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పోలీస్ పర్యవేక్షణ లేకపోవడం,నిర్మానుష్య ప్రదేశం కావడం వల్ల రౌడీషీటర్ల కార్యకలాపాలు,సెటిల్ మెంట్లు కూడా ఇక్కడ జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.గతంలో మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రాంతానికి సంబంధించిన మద్యం తాగి గొడవలు జరిగిన కేసులు నమోదయ్యాయని సమాచారం.ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసి,అక్రమ కార్యకలాపాలను అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను కలిసిన నేతలు

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి23: ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ గనాగరి ప్రీతం జన్మదిన సందర్భంగా ఘనంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహా పాల్గొని ప్రీతంకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని, ఎస్‌సి వర్గాల అభ్యున్నతికి కృషి కొనసాగించాలని ఆకాంక్షించారు. అలాగే ఈ వేడుకలో పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొని ప్రీతం సేవలను ప్రశంసించారు.

అడవులను కాపాడితేనే దేశం సుస్థిరం

- కలెక్టర్ ఆశిష్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 23: ప్రపంచ అటవీ దినోత్సవం, పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ కార్యాలయం నుండి డిగ్రీ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ మాట్లాడుతూ, "మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని కళాశాలలో ఉన్న ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రతి పుట్టినరోజున ఒక మొక్క నాటడం అలవాటు చేసుకోవాలి" అని సూచించారు. "అటవీ సంరక్షణే దేశ సంరక్షణ" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. పిచ్చుకల సంరక్షణపై కూడా దృష్టి సారించాలని, ఇంటి వద్ద నీటి గిన్నెలు ఉంచడం, చిన్న గూళ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, "ప్రాణవాయువు లేకుండా మానవ జీవనం సాధ్యం కాదు. అడవులు, చెట్లు మన జీవనాధారాలు. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు. అటవీ శాఖ అధికారిణి నిఖిత, ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ప్రిన్సిపల్ తదితర అధికారులు పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు. పోలీస్, అటవీ శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశం లో సారధి కళాకారులు తమ గీతాలతో "చెట్టూ చెట్టమ్మను నేను... చెట్టును నేనురా... మనిషి మనుగడకు జీవం పోసే అమ్మ" వంటి నినాదాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అటవీ సంరక్షణ, పరిరక్షణ పోస్టర్ ను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, "నీటి ప్రతిజ్ఞ" చేశారు. ఈ కార్యక్రమం లో ఏసీఎల్‌బీ మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డీవో వీణ, భూగర్భ జల శాఖ అధికారి సతీష్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

సరస్వతి అంత్య పుష్కరాల పనుల్లో జాప్యం వద్దు

- కలెక్టర్ రాహుల్ శర్మ
- ఏప్రిల్ 30లోగా పనులు పూర్తి కావాలి
- డెడ్ లైన్ విధించిన జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి, మార్చి 23: కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను హెచ్చరించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన వివిధ శాఖల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గతంలో నిర్వహించిన సమావేశంలో అధికారులే స్వయంగా పనుల పూర్తికి గడువు ఇచ్చారని, ఆ గడువు ప్రకారమే పనులు పూర్తి కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. "మీరు ఇచ్చిన డెడ్‌లైన్ ప్రకారం పనులు ఎందుకు పూర్తి కాలేదో నాకు అనవసరం, ఏప్రిల్ 30వ తేదీ నాటికి ప్రతి పని పూర్తయి తీరాలి" అని ఆయన తేల్చి చెప్పారు. ముఖ్యంగా మహాదేవపూర్ వద్ద నిర్మిస్తున్న ఆర్చ్ పనుల పురోగతిపై దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు వివిధ శాఖలకు దిశానిర్దేశం చేశారు ,మిషన్ భగీరథ పంచాయతీ రాజ్ శాఖలు నిరంతర నీటి సరఫరా, పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖలు ఘాట్‌ల వద్ద ప్రధాన రహదారుల వద్ద లైటింగ్, రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని. భక్తుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పోలీస్ శాఖ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం డిఎస్పీ సూర్య నారాయణతో పాటు దేవాదాయ, ఇరిగేషన్, పీఆర్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

“

వచ్చే మూడేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. విశాఖ, అమరావతి, తిరుపతిని 3 రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. భోగాపురం విమానాశ్రయం దాదాపు పూర్తయింది. జులైలో ప్రారంభిస్తాం. రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా ఉత్తరాంధ్ర మారుతుంది.
- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

ఉపకాల్వలు పూర్తిచేసి రైతులను ఆదుకోండి

- చెరువుకుంటలను పునరుద్ధరించండి
- అసెంబ్లీలో గలమెత్తిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 23: కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కొండపోచమ్మ మల్లన్న సాగర్ ప్రాజెక్టులు నిర్మించుకోవడంతోపాటు నీళ్లు తీసుకోవడం జరిగిందని, ఉపకాల్వలు లేకపోవడంతో రైతులకు సాగునీటి గోస ఏర్పడుతుందని, వెంటనే ఉప కాల్వలు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం అసెంబ్లీ సమావేశంలో సాగునీటి రంగం పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంకు మల్లన్నసాగర్ కొండపోచమ్మ ద్వారా సాగునీళ్లు అందుతాయన్నారు. గత ప్రభుత్వం లోనే ప్రధాన కాలువలు పూర్తి అయినప్పటికీ ఉపకాల్వలు పూర్తి కాకపోవడంతో రైతులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సాగునీటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయన్నారు. గతంలో తక్కువ నష్టపరిహారం ఉండడంతో రైతులు అంగీకరించకపోవడంతో కోర్టులో డిపాజిట్ చేయడం జరిగిందని, ప్రభుత్వం చొరవ చూపి పెరిగిన రిజిస్ట్రేషన్ వేల్యూ ప్రకారం వారికి నష్ట పరిహారం అందిస్తే వారు ముందుకు రావడం జరుగుతుందన్నారు. కోర్టు కేసులు ,భూ సేకరణ ,నష్ట పరిహారం సమస్యలు త్వరగా పరిష్కరించి నిర్మాణం పూర్తి చేయాలని ఆయన కోరారు. అలాగే ఇర్కోడు ఎత్తిపోతల పథకం కు నిధులున్నా పనులు పూర్తి చేయకపోవడంతో రైతులకు అన్యాయం జరుగుతుందని, వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవ చూపాలని ఆయన కోరారు.అలాగే కాలువలలో పూడిక తీత కోసం నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువు కుంటలను పునరుదించడం జరిగిందని, గత మూడు నాలుగు సంవత్సరాలుగా పనులు జరగకపోవడంతో పిచ్చి మొక్కలతో చెరువు కుంటలు నిండిపోయాయని, వెంటనే నిధులు మంజూరు చేసి చెరువుకుంటలు బాగు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- మెదక్ సిటిజన్ ఫోరం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 23 : జిల్లా ఖరీఫ్ సీజన్ పంట నష్టపోయిన రైతులకు చెల్లించాలని మెదక్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షులు బి కొండల్ రెడ్డి తెలిపారు సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో మెదక్ సిటిజన్ ఫోరం తరపున మెదక్ జిల్లా కేంద్రంలో పాలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించడం జరిగిందని ఆయన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాలు రావడంతోటి వరదల కారణంగా రైతులు చాలా మేరకు నష్టపోవడం జరిగిందని వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని అలాగే మెదక్ జిల్లా కేంద్రంలో రైతు బజార్ భవనాన్ని శంకుస్థాపన చేయాలని రైతు బజార్ ప్రారంభం కాకపోవడంతో మార్కెట్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని ప్రజలు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు జిల్లా కేంద్రంలో కుక్కలు కోతుల బెడత చాలా తీవ్రంగా ఉందని కోతులు మనుషులపై దాడికి వస్తున్నాయని చిన్నపాటి బస్తా కనబడితే ఘర్షణ వాతావరణం కనబడుతుందని కావున జిల్లా కలెక్టర్ చొరవ చూపి కోతుల.కుక్కల. పందుల బెడదను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు పి.డి. ఆనందం భూపాల్ రెడ్డి భుజంగారెడ్డి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పట్టించుకోని అధికార పార్టీ తీరుపై నిరసన

- ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన గజ్వేల్ కౌన్సిల్ సభ్యులు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 23: మున్సిపాలిటీ లో జరిగే పలు ప్రభుత్వ కార్యక్రమాలలో తమను భాగస్వామ్యుల ను చేయడం లేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార దాహంతో ప్రోటోకాల్ పాటించడం లేదని గజ్వేల్ ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డీవో చంద్రకళ మరియు ఇన్చార్జ్ ఎమ్మార్వో లకు సోమవారం నాడు స్థానిక మునిసిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండాలి కానీ ప్రజాస్వామ్యం చేత ఎన్నుకోబడిన ప్రతినిధులకు కాకుండా అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు లొంగి అధికారులు వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్న తీరు దారుణం అన్నారు. రంజాన్ తోఫాలో పంపిణీలో అధికారులు మున్సిపల్ పాలక వర్గాన్ని అనుసరించి కంపెనీలు భాగస్వామ్యం చేసి అందించవలసిన బాధ్యత అధికారులపై ఉంది కానీ, అధికారులు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు తలొగ్గి మున్సిపల్ పాలకవర్గానికి సమాచారం లేకుండా రంజాన్ తోఫాలను కాంగ్రెస్ పార్టీ నాయకులకు అందించడం సహించరానిది అన్నారు. అంతేకాకుండా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ముస్లిం మైనార్టీ ప్రజలకు ప్రభుత్వం నుండి అందవలసిన సంక్షేమ ఫలాలు కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాత్రమే పంచుకుంటున్నారనీ పేద మైనార్టీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. పథకాల పంపిణీలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు తలొగ్గి అధికారులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పంపిణీ కార్యక్రమం చేయడం చాలా దారుణం అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు పునరావృతం కాకుండా అధికారులు సరైన చర్యలు తీసుకోనీ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మ భాయ్ నరసింగరావు, కౌన్సిలర్లు అతేలి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, కామునీ మురళి, బొగ్గుల స్వప్న సురేష్, కోట బాబు, గోలి మమతా సంతోష్, కప్పమమత పోచయ్య, భాగ్యలక్ష్మి కనకసేన, కొలిచెల్మి భవాని, తదితరులున్నారు.

భగత్ సింగ్ ఆశయాల బాటలో సీపీఎం ఉద్యమాలు

- జిల్లా కార్యదర్శి నర్సమ్మ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చ్ 24 : భగత్ సింగ్ ఆశయాలను ఆచరణలో పెట్టినది సీపీఎం అని పార్టీ వల్ల ఎన్నో ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తున్నామని మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ తెలిపారు. సోమవారం భగత్ సింగ్ 95 వ వర్ధంతి ని పురస్కరించుకొని మెదక్ కేవల్ కిషన్ భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నర్సమ్మ.కార్యదర్శి వర్గ సభ్యులు ఏ మల్లేశం మాట్లాడుతూ భగత్ సింగ్ బ్రిటీసు పాలనలో స్వరాజ్య స్థాపన కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి 23 సంవత్సరాల వయస్సులోనే ఉరి తీయబడిన మహా నాయకుడని కొనియాడారు.భగత్ సింగ్ దేశ స్వతంత్ర సాధన కోసం పోరాడి తమ ప్రాణాలను అర్పించిన నాయకుడన్నారు. విదేశీ పాలకులు వెళ్లినప్పటికీ ప్రస్తుతం దేశ పాలకులు సామాన్యుడి శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని,రైతు, కూలీల కు నష్టం కలిగించే నిర్ణయాలు చేస్తూ అమలు చేస్తుందన్నారు.సామాన్యుడి జీవిత పరిస్థితి మారాలంటే మార్క్స్ సిద్ధాంతాన్ని అమలు జరపాలని,సమాజ మార్పు కోసం వృతి విప్లవ కారులు అవసరమని భగత్ సింగ్ తేలిపారన్నారు.సమాజ మార్పు కమ్యూనిస్టుల వల్లనే జరుగుతుందని ఆనాడు భగత్ తెలిపారన్నారు. సిపీఎం పార్టీ జిల్లాలో భగత్ సింగ్ ఆశయ సాధనలో భాగంగా పోరాటాలు ,ఉద్యమాలు నిర్వహించి సమాజ మార్పు కోసం తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు జె. సంతోష్ కుమార్,ch అజయ్ కుమార్,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతలకు దారి తీసిన సీఐపై చర్యలు తీసుకోవాలి

- నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి డిమాండ్

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చ్ 23: గజ్వేల్ నియోజకవర్గంలో వర్గల్ మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఘటన రాజకీయంగా ఉద్రిక్తతలకు దారితీసింది. స్థానిక సర్పంచ్ కుమారుడు నాగరాజుపై వర్గల్ సీఐ దాడి చేసి, పరుషపద జాలంతో దూషించాడని ఆరోపిస్తూ గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్పంచ్ కుమారుడు నాగరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, అలాగే ప్రస్తుత వార్డ్ మెంబర్లపై దాడి ఎందుకు చేయాల్సి వచ్చిందో సీఐ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఎవరి ఆదేశాలు ఉన్నాయో వెల్లడించాలని కోరుతూ, సంబంధిత సీఐపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గజ్వేల్ ఏసీపీని అభ్యర్థించారు. చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ప్రైవేట్ కేసు వేస్తామని హెచ్చరించారు. ఇదే సమయంలో వర్గల్ మండలంలో మట్టి మాఫియా కార్యకలాపాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల అనుచరులు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతూ, అడ్డుకునే వారిపై దాడులకు దిగుతున్నారని అన్నారు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారిపై కూడా పోలీస్ స్టేషన్‌లోనే దురుసుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో టీజీఐసీ ద్వారా ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూసేకరణ జరిగిందని, రైతులు ఉపాధి ఆశతో భూములు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు కోర్టు కేసులతో పరిశ్రమల ఏర్పాటును అడ్డుకుంటూ, కంపెనీలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వర్గల్ లో పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, కాంగ్రెస్ నాయకులతో కుమ్మక్కై పని చేస్తోందని విమర్శించారు. ప్రజాపాలన పేరుతో గుండాయిజం, రౌడీయిజం సాగుతోందా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అలాగే గజ్వేల్ నియోజకవర్గంలో ప్రోటోకాల్‌కు విరుద్ధంగా కొన్ని వ్యక్తులు కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించిన వంటేరు ప్రతాప్ రెడ్డి, వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ లతా రమేష్ గౌడ్, జిల్లా యూత్ నాయకులు, మాజీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోటళ్లపై అధికారులు మెరుపు దాడులు

ప్రతిపక్షం సిద్దిపేట మార్చి 23: సిద్దిపేట పట్టణంలోని పలు దాబాలు, హోటళ్లపై సివిల్ సప్లై , ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. జిల్లా అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులలో డొమెస్టిక్ సిలిండర్ లను గుర్తించారు. 14 హోటల లో 24 డొమెస్టిక్ సిలిండర్ల సీజ్ చేసినట్లు జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజ తెలిపారు. అక్రమంగా హోటలల్లో వాడుతున్న డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అబద్ధపు మాటలతో... అభివృద్ధి గడ్డ మలినం

- ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వద్ద శుద్ధి చేసిన బీఆర్ఎస్‌వీ కార్యకర్తలు
- కేసీఆర్, హరీశ్ రావు చిత్ర పటాలకు పాలాభిషేకం

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 23: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ వద్ద బీఆర్ఎస్‌వీ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేటకు నిధులు విడుదల చేయకుండా, అబద్ధాలతో జిల్లా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్‌వీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, పట్టణ సమన్వయకర్త ఇరుగంటి రమేశ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న సభా స్థలిని శుద్ధి చేసే కార్యక్రమం చేపట్టారు. భారీగా మోహరించిన పోలీసులు నాయకులను సభా ప్రాంగణంలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్, హరీశ్ రావు కృషి వల్ల ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మంజూరు అయిందని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి మాత్రమే వచ్చారని, ఎటువంటి కొత్త నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, నంగునూరు మండల సమన్వయకర్త తప్పెట పరశు రాములు, దాసరి రమేశ్, రంగు చింటు, ఎం.డి. గఫూర్, కిరణ్ గౌడ్, ఇరుగంటి రమేశ్, పెర్క మధు, అనిల్ రెడ్డి శ్రవణ్ గౌడ్, మద్దూరి రాజు, సంపంగి శ్రీకాంత్, రజినీకాంత్, నాగరాజు యాదవ్, కొరివి తిరుపతి, సుందు పరశు రాములు, సారయ్య, భాను, సాయి, చింటు గౌడ్, అరవింద్ , సోహెల్, చిన్న, ఆకుల రాజు, వంశీ, శ్రీను, రాజు, కుమార్, బాల రాజు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీజేపీ నేతల అరెస్ట్

ప్రతిపక్షం, చేగుంట, మార్చి23: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా చేగుంట మండల నాయకులు ఎల్లారెడ్డి చింతల భోపాల్ గోవింద్ సోమ సురేష్‌లను అరెస్ట్ చేశారు. అలాగే నార్సింగి మండల కేంద్రంలో బిజెపి అధ్యక్షుడు సిర్నా చంద్రశేఖర్ ఎన్నం లింగారెడ్డి దాయం నరేష్ మైలారం నర్సింలు నరేష్ లను అరెస్ట్ చేశారు. అలాగే మాసాయిపేట తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లో బిజెపి నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సాయంత్రం సొంత పూచి పై విడుదల చేశారు.

యాసంగి ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 23 : జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ, పౌర సరఫరా, అటవీ, శ్రీ శిశ సంక్షేమ శాఖలు అధికారులందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సన్నాహాలు చేయాలని అధికారులు ఆదేశించారు. ఏప్రిల్ 15 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని సూచించారు. యాసంగి (రబీ) లో 4,45,466 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని స్వీకరించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మెదక్ జిల్లాలో వన మహోత్సవంలో కార్యక్రమంలో లక్ష్యంగా మొక్కలు నాటి వాటి సంరక్షించాల్సిన బాధ్యత అధికారుల ది అన్నారు. ఈ సంవత్సరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాకు 31.7 లక్షల మొక్కలు నాటాలని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పటిష్ట కార్యచరణ తో సిద్ధంగా ఉండాలన్నారు. జూలై మొదటి వారంలో ప్రారంభించే ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నర్సరీలలో ఎక్కడెక్కడ మొక్కలు లభ్యమవుతాయి ఏ ఏ మొక్కలు నాటాల్సి ఉంటుంది అలాగే 2027 టార్గెట్, 2028 లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిక అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు.బాల్యవివాహాలు నిషేధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. తక్కువ బరువు, ఎత్తు కలిగిన చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. తక్కువ బరువు, ఎత్తు ఉన్న పిల్లల్ని గుర్తించి పరిత వెతిన సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి , ఇతర దరఖాస్తులను పరిశీలించి శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సోమవారము జిల్లా వ్యాప్తంగా 73 ప్రజావాణిలో ఫిర్యాదులు రావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- 5.41 కోట్లతో సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం
- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చ్ 23: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యత ఇస్తుండగా, నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలలో 5 కోట్ల 41 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండలం మజీద్ పల్లి గ్రామ సర్పంచ్ చెన్నయ్యతో కలిసి సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతులు అభ్యున్నతిని కాంక్షిస్తూ 2 లక్షల పంట రుణమాఫీతో పాటు సన్న ధాన్యానికి 500 బోనస్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయగా, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, ఉప సర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజధాని అమరావతిపై వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అమరావతిని ప్రభుత్వం ఎలా పూర్తి చేయగలదనే భ్రమల్లో వైసీపీ నేతలున్నారు. రాజధానిలోని నిర్మాణాలు మామూలువి కాదు.. ఐకానిక్ భవనాలు. ప్రపంచంలోనే అత్యద్భుతమైన అసెంబ్లీ భవనాన్ని నిర్మిస్తున్నాం. అమరావతి నిర్మాణానికి అయ్యే అప్పుల్ని భూముల అమ్మకాల ద్వారా తీరుస్తాం.

- ఏపీ మంత్రి నారాయణ

బీజేపీ, ఆర్ఎస్ఎస్ సృష్టించిన పదం 'వనవాసి'

- గిరిజనులను అలా పిలిస్తే రాజ్యాంగాన్ని అవమానించినట్టే: రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 23: కేంద్ర ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. గిరిజనులను 'వనవాసి' అని సంభోదించడంపై విమర్శలు గుప్పించారు. శతాబ్దాలుగా గిరిజనులకు చెందిన నీరు, అడవులు, భూములపై వారి అసలైన యాజమాన్య హక్కులను నిరాకరించడానికే ఈ పదాన్ని సృష్టించారని ఆరోపించారు. దేశంలో అధికారం, సంపదలో గిరిజనులు తమ వాటాను పొందాలంటే కుల గణన అత్యంత కీలకమని గాంధీ పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో జరిగిన 'ఆదివాసీ అధికార్ సంవిధాన సమ్మేళన్'లో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'వనవాసి' అనే పదం గిరిజనులు కేవలం అడవులలో నివసిస్తున్నారని సూచిస్తుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆదివాసీలను 'వనవాసి' అని పిలవడమంటే రాజ్యాంగంపై, గిరిజన నాయకుడు బిర్సా ముండాపై దాడి చేయడమేనని ఆరోపించారు. "భారత రాజ్యాంగం వేల సంవత్సరాల నాటి తత్వాన్ని తనలో ఇముడ్చుకుంది. మోదీతో సహా బీజేపీ నాయకులు బిర్సా ముండా, అంబేద్కర్, పూలే, గాంధీల విగ్రహాలకు నమస్కరిస్తారు. కానీ బిర్సా ముండా ప్రతిపాదించిన సూత్రాలను, ఆయన ఆశయాన్ని కాపాడటంలో విఫలమవుతున్నారు. రాజ్యాంగం బిర్సా ముండా వాణికి ప్రతిరూపం. బీజేపీ గిరిజనులను వనవాసులు అని ముద్రవేస్తోంది. తద్వారా వారి నీటిని, అడవులను, భూములను కార్పొరేట్లకు అప్పగిస్తోంది. అభివృద్ధి పేరిట ఆదివాసీల భూములను ఎటువంటి పరిహారం చెల్లించకుండానే లాక్కుంటున్నారు." అని రాహుల్ విమర్శించారు.

విశ్వ వీక్షణం

జనగణన ఆధారంగా మహిళలకు రిజర్వేషన్లు

- వచ్చే వారం రాజ్యసభలో సవరణ బిల్లు
- 2029 కన్నా ముందే అమలు చేసేందుకు యోచన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 23: కేంద్ర ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ఆధారంగా మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతిపాదిత స్వరూపం ప్రకారం లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుంచి 816కు పెరుగుతాయి. ఇందులో 273 సీట్లలో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తారు. కొత్త సెన్సస్, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తర్వాతే రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుందని ఈ చట్టం నిర్దేశిస్తున్నది. అయితే ప్రభుత్వం మాత్రం ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే చట్టాన్ని సవరించి పార్లమెంట్ దిగువ సభలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ రాజ్యాంగ సవరణ బిల్లు సజావుగా ఆమోదం పొందేందుకు ప్రతిపక్షాలను కూడా ప్రభుత్వం ప్రాథమికంగా సంప్రదించినట్లు తెలుస్తున్నది. క్యాబినెట్ ఆమోదం తర్వాత ముందుగా వచ్చే వారం రాజ్యసభలో సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల లభిస్తుంది. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తున్నది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది.

రైతు రుణమాఫీ ప్రతిపాదన కేంద్రం పరిశీలనలో లేదు

- నిర్మలా సీతారామన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 23: రైతులకు పూర్తి రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో వెల్లడించారు. అయితే, రైతుల ఆర్థిక పరిస్థితులను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, వాటిలో కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) ద్వారా సకాలంలో తగినంత రుణం అందించడం కూడా ఉందన్నారు. ఈ కేసీసీ కింద రూ. 3 లక్షల వరకు పంట రుణాన్ని రాయితీ వడ్డీ రేట్లకు అందిస్తున్నామని తెలిపారు. సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద సకాలంలో తిరిగి చెల్లిస్తే అదనపు ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నామని గుర్తు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసిన ప్రాధాన్య రంగ రుణాల మార్గదర్శకాల ప్రకారం అనుబంధ కార్యకలాపాల రుణాలతో సహా, పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను రూ. 1.60 లక్షల నుంచి రూ. 2 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. అలాగే వ్యవసాయంతో సహా ఆర్థిక వ్యవస్థలోని ప్రాధాన్య రంగాలకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తగినంత రుణ ప్రవాహం ఉండేలా చూస్తున్నామని లోక్‌సభకు ఇచ్చిన సమాధానంలో తెలిపారు. వీటితోపాటు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకం కింద రైతులకు నేరుగా నగదు బదిలీతో పాటు పంటల బీమా అందిస్తున్నామని పేర్కొన్నారు.

తమిళనాడులో ఎన్డీయే సీట్ల సర్దుబాటు

- 27 స్థానాల్లో బీజేపీ పోటీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, మార్చి 23: తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. విజయం కోసం కీలక పార్టీలు అన్నీ తమ వ్యూహాలను రచిస్తున్నాయి. మరో వారం రోజుల్లో నామినేషన్ ప్రక్రియ కూడా మొదలుకానుంది. ఈ క్రమంలోనే ఎన్నికలకు సంబంధించి ఎన్డీఏ పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. బీజేపీకి 27 స్థానాలు ఇచ్చేందుకు అన్నాడీఎంకే ఒప్పందాన్ని ఖరారు చేసింది. పట్టలి మక్కల్ కట్చి (పీఎంకే)కి 18, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)కు 11 స్థానాలు కేటాయించింది. మిగితా 178 స్థానాల్లో అన్నాడీఎంకే పోటీ చేయనుంది. సోమవారం ఈ మేరకు చెన్నైలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో జరిగిన ఎన్డీఏ పక్షాల భేటీలో నిర్ణయం జరిగింది. ఈ సమావేశంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి పళనిస్వామి, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాసు, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సీట్ల పంపకాల వివరాలను ప్రకటించారు. అయితే గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి ఈసారి అదనంగా ఏడు సీటు వచ్చాయి.

ప్రతిపక్షం
Prathipaksham.in

కవిత్వ ప్రక్రియ పట్ల– భిన్న అవగాహనలు



బి ఎస్ రాములు
8331966987

కవిత్వానికి రకరకాల నిర్వచనాలు.

కవిత్వం అనే సాహిత్య ప్రక్రియ పట్ల భిన్న అవగాహనలు కొనసాగుతున్నాయి. కవిత్వం కప్పి చెపుతుంది. విమర్శ విప్పి చెపుతుంది అన్నారు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు. అర్థం కాని కవిత్వం వ్యర్థం అన్నారు మరొకరు. కవులు తమ కవిత్వం ఎలాంటిదో చెపుతుంటారు. అదేదో కవిత్వంలో చెప్పక, వ్యాసాల్లో, ఉపన్యాసాల్లో చెప్పడం దేనికి? కవిత్వ ప్రక్రియలతోనే చెప్పండి అని విద్యార్థులకు సూచించాను. అది తమనే అన్నారనుకొని కవుల మీద అంత కోపమెందుకు సార్! అన్నారు. చక్కగ రాయండి. బాగా నేర్వండి. పలురీతులను, పలు భాషల కవిత్వాన్ని అధ్యయనం చేయడం ద్వారా అభివ్యక్తి ప్రతిభ వికసిస్తుంది. ఈ మధ్య తెలుగులో కవిత్వానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. వైరముత్తో అనే తమిళ కవికి జ్ఞాన పీఠ పురస్కారం ప్రకటించారు. వైర ముత్తు కవిత్వం మీద, వ్యక్తిత్వం మీద జయ మోహన్ వంటి వారు దేశ వ్యాపితంగా విరుచుకు పడుతున్నారు. కవిత్వానికి ఎవరి నిర్వచనం వారిది. సరే అదలా ఉండనీ!

సాహిత్యంలో కవిత్వం ఒక ప్రక్రియ

భావ వ్యక్తీకరణకు అనేక మార్గాలున్నాయి. " చెంపకు చేయి పరంబైన కంటికి కన్నీరాదేశంబగు " విధంగా భౌతిక చర్యలు , హావ భావ భావాలు, కంటి చూపులు ్నాయి.. భావ వ్యక్తీకరణ రీతులతో సాహిత్యం రూపు దిద్దుకున్నది. అట్లాంటి సాహిత్యంలో కవిత్వం అనేది ఒక ప్రక్రియ. పాట అనే ప్రక్రియ కవిత్వంలో తొలి ప్రక్రియ . ఇపుడు పాటను కవిత్వంలో భాగంగా చర్చించకుండా వదిలేస్తున్నారు. కవి సమ్మేళనాల్లో పాట కవులను ఆహ్వానించడం పట్ల విముఖత ప్రదర్శిస్తుంటారు.

పాట నుండి అనేక ప్రక్రియలు పుట్టాయి

పాట నుండి అనేక ప్రక్రియలు పుట్టాయి. పద్యం అందులో ఒకటి. వేల సంవత్సరాలు గడిచాక ఇటీవల తెలుగులో వచన కవిత అనే ప్రక్రియ పుట్టింది. వచన కవిత్వ ప్రక్రియ పుట్టి ఇంకా వందేళ్ల కాలేదు. గురజాడ, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, ఉన్నవ లక్ష్మి నారాయణ, గేయ కవిత్వం రాసారు. ప్రాచీన కవిత్వంలో కావ్యాలు పద్యాలు, మధ్య మధ్యలో గద్యం రాసారు. దాన్ని చంపు కావ్యం అన్నారు. ప్రాచీన కవిత్వంలో పాటలతో కావ్యాలు ప్రదర్శన కళా రూపాలు ప్రజల్లో చొచ్చుక పోయాయి. వాటిని జానపద కళలు అన్నారు. పద్యాలతో సంస్కృతంలో , తెలుగులో కావ్యాలు నాటకాల రూపంలో వెలయించారు.

వాక్యం రసాత్మకం కావ్యం

వాక్యం రసాత్మకం కావ్యం అన్నారు. కావ్యేషు నాటకం రమ్యం అన్నారు. ఇపుడు సకల కళల సమాహారంగా ఎదిగిన సినిమాకు ఈ మాట వర్తిస్తుంది. వివిధ స్థాయీ భావ దశలను(మూడ్సును, సెంటిమెంట్లను) రసం స్థాయికి ఉదాత్తీకరించడం, ఉన్నతీకరించడాన్ని రసాత్మకం చేయడం అని చెప్ప వచ్చు. అలా రసాత్మక వాక్యమే రమ్యం అని సాహిత్య శాస్త్ర వేత్తలు ఒక నిర్వచనం ఇచ్చారు. ధ్వన్యాత్మక వాక్యం, వక్రోక్తి వాక్యం కూడా కావ్యమే అని నిర్వచనాన్ని విస్తరించడం జరిగింది. కరుణ శృంగార వీర, ఆది నవ రసాలు, భక్తి రసం ... ప్రతి భావాన్ని రసం స్థాయికి తీసుకెళ్లడం వచ్చు అని అందు వల్ల రసాలు అనంతం అన్నారు.

పద్యాల్లో రకరకాల ప్రక్రియలు

కావ్యాలు, పురాణ ఇతిహాసాలు, ప్రబంధ కావ్యాలు, నాటకాలతో పాటు చాటువులు, సూక్తులు, సందేశాలు, ఉపదేశాలు, నీతి ప్రబోధాలు పద్యాలు, పాటలు, సామెతలు , ఖండ కావ్యాలు, ముక్తకాలు, శతక కావ్యాలు, సంవాదం, చిత్ర కవిత్వం, రెండర్థాల ద్వర్థి కావ్యాలు , త్ర్యర్థి కావ్యాలు వెలిసాయి. కథాత్మక కావ్యాలు, కథా రహిత కావ్యాలు, కవిత్వాలు మొదలైన అనేక విధాలుగా కవితా ప్రక్రియలు వికసించాయి. కాగితం . ప్రింటింగ్ ప్రెస్ లేక ముందు తాటాకులు తోలు, రాళ్లు, రాగి రేకులపై రాసి భద్రం చేసారు. తాటాకు మీద రాతకు ఆయుషు నాలుగు వందల ఏళ్లు! కాగితం పుట్టాక మాటకు విలువ తగ్గి దస్తావేజులకు , సంతకాలకు విలువ పెరిగింది. సరే అదలా ఉండనీ!

పాట యొక్క జ్ఞాపక శక్తి

పాట, పద్యం, సామెత, నుడికారం జ్ఞాపకం ఉండడానికి రాగ యుక్తంగా లయాత్మకంగా ఉండడం కారణం.. అలా విధంగా లేనిది గుర్తుంచుకోవడం సాధ్యం కాదు. ఉదాహరణకు నేటి వ్యాసం, కథ , నవల, సంపాదకీయం యధాతధంగా గుర్తుంచుకోవడం సాధ్యం కాదు. దాని రాసిన రచయితకు కూడా అది సాధ్యం కాదు. జ్ఞాపకం లేనపుడు అది ప్రభావం ఎలా వేస్తుంది అనే జ్ఞాన శాస్త్ర విషయం. జ్ఞాపక శక్తికి లయాత్మకతకు సంబంధం ఉంది. పాటపుట్టుక అనే గ్రంథంలో ఈ విషయం వివరంగా రాసి వున్నాను. పాటలో పల్లవిని మళ్లీ మళ్లీ పాడడం అనే అంశం కూడా జ్ఞాపక శక్తి పై బలమైన ముద్ర వేస్తుంది. పల్లవి ఒకటే గుర్తుండి చరణాలు మరిచి పోవడం గమనించవచ్చు. శతక పద్యాలు బాగా గుర్తుంటాయి వేమన పద్యాలు, సుమతీ శతకం, పోతులూరి నీర బ్రహ్మం పాటలు, అచల తత్వాలు, నరసింహ శతక పద్యాలు మొదలైనవి బాగా గుర్తుంటాయి.

వచన కవిత్వ ప్రారంభ వికాసాలు

కవిత్వం అందరికీ అందుబాటులోకి తేవాలని , పద్యాల చందస్సు ఇబ్బంది పెడుతుందని మధ్య తరగతి అక్షరాస్యులు పద్యం నుండి పాటకు, మరోవైపు వచన కవిత్వానికి రెండు పాయలుగా విస్తరించారు. నంబూరి గారి ఎంకి

నాయుడు బావ పాటలు సుప్రసిద్ధం.పాట వలె ప్రజలను చేరడం పద్యానికి, వచన కవిత్వానికి సాధ్యం కాలేదు. సాధ్యం కాదు కూడ. ఇటీవల బుల్లెట్ బండెక్కి వచ్చేస్త పా అనే పాట ఖండాంతరాలు విస్తరించింది. కొన్ని కోట్లముంది వీక్షించారు. దాన్ని మించి రాము రాథోడ్ పాట రాను బొంబాయికి పాట డెబ్బయి కోట్ల మంది వీక్షించారు. తెలుగు సాహిత్యంలో ఇదొక వరల్డ్ రికార్డు.

సినిమా పాటల విశిష్టత

సినిమా పాటలు కోట్లాది మందిని అలరించాయి. వారి జీవితాల్లో భాగమయ్యాయి. సినిమా పరిమితి నుంచి విడివడి కొన్ని వందల రెట్లు స్వతంత్రంగా ప్రజల హృదయాల్లోకి చేరి పోయాయి. అది పాట ప్రక్రియ గొప్ప తనం. తాను రాసింది తనకే గుర్తు లేక పుస్తకం చూసి చదవడానికి వచన కవిత్వం పరిమితమై పోయింది. సినిమా పాట పై పైడిపాల పిహెచ్డీ చేశారు. లలిత గీతాలపై వడ్డేపల్లి కృష్ణ పీహెచ్డీ చేశారు. ఉద్యమ పాటపై పసునూరి రవిందర్ పిహెచ్డీ చేశారు. దీర్ఘ వచన కవితలపై నెల్లురు నుండి పిహెచ్డీ చేశారు. ప్రకాశ్ నుండి పల్లేరు వీర స్వామి శతక సాహిత్యంపై పీ హెచ్డీ చేశారు. ఇలా పాట పై పరిశోధనలను వేల్ల మీద లెక్క పెట్ట వచ్చు. అదే సమయంలో వచన కవిత్వం పై లెక్క లేనన్ని పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. మధ్య తరగతి ని బాగా ఆకర్షించే ప్రక్రియ గనక వచన కవిత్వంపై పరిశోధనలు కొత్త పుంతలు తొక్కాయి.

అంతేనా!

అర్థం కాని భాషలో రాయడం కొందరికి బాగా ఇష్టం. సాగదీసిన కొద్దీ అనేక అర్థాలు వచ్చే విధంగా రాయడం వారికి చాలా యిష్టం. మను ధర్మ పరాయణులు , వర్ణాధిక్య వాదులు, పాండిత్య ప్రదర్శకులు సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు పదాలతో, సమాసాలతో రావణుడు చదివిన శివాష్టకంలా పరమ గంభీరంగా రాయడం ఇష్టం.

అంతే అంతే

మాటల మధ్యలో జ్ఞాన పీఠ అవార్డు గ్రహీతడాక్టర్ సి నారాయణ రెడ్డి గారితో ఓ మాట చెప్పాను. ఓ యాభయి ఏండ్లు పోయినంక మీ వచన కవిత్వం కన్నా మీ సినిమా పాటలు, గజల్లే నిలుస్తాయి. వచన కవిత్వం మిగలదు అని అన్నాను.అంతేనంటవా రాములు అన్నారు. ఔను సార్! అన్నాను. సినిమా పాట, సినిమా తో పాటు రేడియో లో, టీవీలో, ఫంక్షన్లలో రకరకాల సందర్భాల్లో ప్రచారమవుతుంది. సంగీత దర్శకుని పేరిట , దర్శకుని పేరిట, హీరో, హీరోయిన్‌ను పేరిట, కవి పేరిట, సంగీతం పేరిట .., ఇలా రకరకాలుగా నిరంతరం ప్రచారంలో వుంటుంది. ఇలా సినిమా పాటను అనేకమంది అనేక తీరుల్లో మోసుక పోతారు. అలా నిరంతరం వ్యాప్తి చెందుతుంది. వచన కవిత్వానికి ఈ హంగులు లేవు కదా అన్నాను.

తనదారి తాను వెతుక్కున్న వచన కవిత్వం

ఈ విషయం గమనించిన వచన కవిత్వం తనదారి తాను వెతుక్కుంది. శీలా వీర్రాజు వచన కవిత్వంలో కథలు రాసారు. అది ప్రయోగంగా మిగిలి నిలిచి పోయింది. దీర్ఘ కవితలు, కవితలు, మనీ కవితలు, నానీలు, రెక్కలు, చుక్కలు, సప్త పది, హైకూలు , మినీ కవిత , దీర్ఘ కవిత, దీర్ఘ కావ్యం వంటి అనేక సైజులకు , రూపాలకు విస్తరించింది వచన కవిత్వం. వచన కవిత్వంలో దేవరకొండ బాల గంగాధర్ తిలక్ గారి అమృతం కురిసిన రాత్రి అనే వచన కవితా సంపుటి పేరెన్నిక గన్నది. వచన కవిత్వంలో సి నారాయణ రెడ్డి గారు విశ్వంభర వచన కవిత్వ దీర్ఘ కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం పొందారు. ఒక హిందీ కవి నా కవితా సంపుటికన్నా నా సినిమా పాటలకు జ్ఞాన పీఠ పురస్కారం ఇస్తే ఇంకా ఎక్కువ సంతోషించే వాన్ని అన్నారు. వైర మత్తు అనే తమిళ కవి పద్మశ్రీ , పద్మ భూషన్, అందుకున్నాయనకు జ్ఞాన పీఠ పురస్కారం ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. వైర ముత్తు కూడా సినిమా రంగానికి చెందిన వారే.

మినీ కవిత్వంలో అలిశెట్టి మేటి

మినీ కవిత్వంలో అలిశెట్టి ప్రభాకర్ లక్షలాది హృదయాలకు చేరువయ్యారు. వచన కవిత్వంలో కావ్యాలు రాయాలని సి వి గారు సత్యకామ జాబాలి, ప్యారిస్ కమ్యూన్ రాసారు. జాషువా పద్య ప్రకియయే తనకు ముద్దు అని అందులోనే ఆధునిక కవితా వస్తువుతో ఉన్నత శిఖరాలకు ఎదిగారు. దాశరథి కృష్ణమాచార్య అటు సినిమా పాటలు, ఇటు పద్య కృతులు వెలయించారు. వారి అనువాద గాలిబ్ గీతాలు ఎంతో మధురం. దాశరథి వచన కవిత్వం రాసినట్టు గుర్తు లేదు.

కాళోజీ బాట

కాళోజీ తొలి నుంచి ఆశు సంప్రదాయ రీతిలో వేమన వలె సమాజాన్ని పలు రీతుల్లో హెచ్చరించడు. సందేశాత్మక, ఉపదేశాత్మక కవిత్వ గేయ సరళిలో రాసారు. ఎక్కడి కక్కడ నోటికి పాడి వినిపించి ప్రజల్లోకి ప్రవహించారు.

వచన కవిత్వం తనకు తానే బందీ అయిన విధం

వచన కవిత్వం ప్రజలకు పోను పోను పద్యం కన్నా కష్టంగా మారిపోతూ వచ్చింది. రాయడమూ కష్టమే. అర్థం చేసుకోవడమూ కష్టమే , యాదికి ఉంచుకోవడమూ కష్టమే అనే ఒకానొక కార్నర్ కు చేరింది. హిందీలో ఉర్దూలో ఈ సమస్య ఇలా లేదు. పద్యం పాటలాగా పాడి కొనసాగుతున్నది.

పుస్తకం పేరులేని ముఖ చిత్రంతో ఎస్వీ రామారావు కవిత్వం

పెయింటింగ్ ఆర్టులో ఆబ్ స్ట్రాక్టు పెయింటింగ్ కళ ఒక శాఖగా అనేక రకాలుగా విస్తరించింది. చికాగో లో కలుసుకున్నపుడు సుప్రసిద్ధ ఆర్టిస్టు పద్మశ్రీ ఎస్వీ రామారావు గారు తన కవితా సంపుటి ఇచ్చారు. దాని మీద తన పేయింటింగ్ ముఖ చిత్రంగా వేసారు. బాగానే వుంది గాని పుస్తకం పేరే వేయ లేదు. ఆశ్చర్యంగా అడిగాను. కవర్ పేజి యే చెప్తుంది మళ్లీ పేరెందుకు అన్నారు. లోపల ఆ పుస్తకం పేరు కాలాంతరాలు. ఆధ్యాత్మిక కవితా సంకలనం అని ట్యాగ్ లైన్. వేగుంట మోహన్ ప్రసాద్, ప్రొ. టి గౌరీశంకర్ మొదలైన వారు ముందు మాటలు రాసారు.

మో.. గుంటూరు శేషేంద్ర శర్మ .. శివారెడ్డి

మో గారి కవిత్వం కూడా ఇలాగే ప్రత్యేకమైనది. గుంటూరు శేషేంద్ర కవిత్వమే గొప్పది. శివా రెడ్డి కవిత్వమే గొప్పది . అలాంటి కవిత్వమే గొప్పది . నేను మెచ్చిన కవిత్వమే గొప్పది అనుకునే వారున్నారు. అలా అనుకునే హక్కు వారికుంది. కాని ఆ మాటను అందరు ఆమోదించాలి. అలానే రాయాలి అనడమే చిక్కులు తెస్తుంది. తాను మునిగిందే గంగ.. తాను వలచిందే.. తిలోత్తమ. లోకోత్తమ. ప్రవరాఖ్య అనుకోవచ్చు. అది గొప్ప స్పూర్తిని తృప్తిని ఇస్తుంది. అందుకు అభ్యంతరం ఏమీ లేదు గానీ అది మాత్రమే గొప్ప కవిత్వం. అట్లా రాస్తేనే గొప్ప కవిత్వం అని మిగతాది కవిత్వమేకాదనడం చిక్కులు తెచ్చి పెడుతుంది.

నాదే గొప్ప అనుకోవడం

లక్ష యాభయి వేల ఓట్ల మెజారిటీతో గెలిచినాయన కన్నా నాకొచ్చిన పదహారు వేల ఐదు వందల ఓట్లు గొప్పవి, విలువైనవి, చైతన్య వంతులవి. మిగతా వారివి గొర్రె దాటు ఓట్లు అని గెలిచిన వారిని కొందరు హేళన చేస్తూ తామే గొప్ప అనుకుంటారు. మాది చొక్కా బంగారం అంటారు. ఒప్పుకో మంటారు. ఆ బంగారం వారి మెడను అలంకరిస్తూంది తప్ప మనకు అందేది కాదు కద అంటారు జనం.

ప్రజాస్వామ్యంలో సాహిత్యం

సాహిత్యానికి ఒక ప్రయోజనముంది. ప్రజాస్వామ్యంలో ప్రజలకు స్పూర్తినివ్వాలి. హృదయాలను కదిలించాలి. ప్రజలు తమ భావాలకు అదొక గొంతుగా తాదాత్మ్యం చెందాలి. బుల్లెట్ బండెక్కి వచ్చేత్త పా! అనే పాట ప్రతి ఆడపిల్ల హృదయంలో నిలిచి పోతుంది. ఆనంద పరవశంతో పాడుకుంటుంది.

సాహిత్య కర్తవ్యాలు

కవిత్వం ఇలా సాహిత్య మౌలిక లక్ష్యం నెరవేర్చాలి. ప్రజల సాహిత్య అవసరాలను తీర్చాలి. సాహిత్య ప్రయోజనం నెర వేర్చాలి. తన ప్రతిభా సామర్థ్యాలతో ఆధిక్యత ప్రదర్శించి ప్రజలకు అందని, అర్థం కాని కవిత్వాన్ని రాస్తే ప్రజలకు చేరడం తక్కువ. శాస్త్రీయ సంగీతం, ఆబ్ స్ట్రాక్టు పెయింటింగ్ తక్కువ మంది ఇష్ట పడుతారు. గద్దర్, గూడ అంజయ్య, జయ రాజు, గోరటి వెంకన్న, అందెశ్రీ కవిత్వాన్ని పాటను కోట్లాది మంది ఇష్ట పడుతారు. వాటితో స్పూర్తో పొందారు. ఉద్యమాల్లోకి ప్రజలు ప్రవాహంలా కదలి వచ్చారు. వారు రాసేవన్నీ తేలిక పదాలే. అందెశ్రీ కాస్త పండిత పాలు సమాసాలు కూడా ప్రయోగిస్తారు. నది నడిచి పోతున్నది అనే ప్రపంచ నదుల పై రాసిన కావ్యం కాళిదాసు కన్నా గొప్ప కావ్యం.

సాహిత్యం - సాహిత్య శిల్ప చరిత్ర

అర్థంకాని ప్రతీకలు, పద చిత్రాలు, మొదలైన వాటితో కూడిన వాటిని కవిత్వంలో భాగంగా కాకుండా కవిత్వ శైలీ శిల్ప పరిణామ చరిత్రలో భాగంగా చూడాలి. నలభయి ఏళ్ల క్రితమే అరుణతారలో చెప్పిన మాటనే మరోసారి గుర్తు చేస్తున్నాను. చిత్ర కవిత్వం కింది నుంచి పైకి చదవడం, ఒక పద్యంలో రెండు పద్యాలు పొదగడం, ఒకే పద్యం ఒకటికి మించి నానార్థాలు ఇమడ్చడం మొదలైనవి అలంకార శాస్త్ర చర్చకు ఉపయోగం. అవి సాహిత్య మౌలిక లక్ష్యమైన సాహిత్య ప్రయోజనానికి సంబంధించినవి కావు. పాతికేళ్ల క్రితం శతాబ్దాంతంలో తెలుగు కవిత్వం తీరు తెన్నులు అనే అంశం పై అడిగి రాయించి ఆంధ్ర జ్యోతి వీక్లీలో వేసారు. అపుడు కవిత్వంలో ఇరవై రకాల ప్రక్రియలు కొనసాగుతున్నాయని రాసాను. ఇపుడు మళ్లీ పాతికేళ్లకు అలాంటి అవసరమే తోసుకొచ్చింది. ఇపుడు కవిత్వంలో సుమారు ముప్పయి పైగా ప్రక్రియలు కొనసాగుతున్నాయి. దేని అవసరం దానికుంది. దేని పాఠకులు దానికున్నారు. ఒకరికొకరు పాఠకులను గెలుచుకోవడంలో పోటీ పడాలి తప్ప కవుల మధ్య తమదే గొప్ప అనే చర్చలు అర్థ రహితం. అది ప్రజలకు చేరలేక పోతున్న అసమర్థుల ప్రయాస అని గమనించి పట్టించుకోవడం మానేస్తే మంచిది.

(వ్యాస రచయిత సామాజిక తత్వ వేత్త, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్)

ఇంపాక్ట్ ప్లేయర్ విధానం నాకు నచ్చదు: అక్షర్ పటేల్

ఐపీఎల్‌లో ఉపయోగించే ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై మరో క్రికెటర్ పెదవి విరిచాడు. ఈ నిబంధన ద్వారా ఆల్‌రౌండర్లకు అన్యాయం జరుగుతుందని వాదనలు వినిపిస్తున్న వేళ తాజాగా దీనిపై భారత స్టార్ ఆల్‌రౌండర్, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న అక్షర్ పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అక్షర్ మాట్లాడుతూ.. 'ఆ నిబంధన నాకు నచ్చదు. స్వతహాగా నేను ఆల్‌రౌండర్‌ను. గతంలో మేం ఈ రోల్ (బ్యాటింగ్, బౌలింగ్ చేసేవారు) కోసం ఆల్‌రౌండర్‌ను ఎంపిక చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం అవసరాన్ని బట్టి బ్యాటర్, బౌలర్‌ను వాడుకుంటున్నది. అదే సమయంలో మనకు ఆల్‌రౌండర్ అవసరమా? అన్న చర్చ తలెత్తుతున్నది. నేను దీనికి వ్యతిరేకమైనా రూల్స్ అంటే రూల్సే కదా. మనం వాటిని పాటించాలి' అని అన్నాడు. గతంలో రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచిన విషయం తెలిసిందే.

పాకిస్తాన్ రావద్దు

- ఏదైనా జరిగితే మా బాధ్యత లేదు
- విదేశీ క్రికెటర్లకు మిలిటెంట్ గ్రూప్ హెచ్చరిక

మరో రెండ్రోజుల్లో ప్రారంభం కానున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో ఆడేందుకు విదేశీ క్రికెటర్లెవరూ ఇక్కడకు రావొద్దని ఆ దేశానికి చెందిన మిలిటెంట్ గ్రూప్ జమాత్‌ఉల్‌అహ్రార్ హెచ్చరించింది. ఇక్కడ భద్రత ఉండదని, ప్రస్తుతం దేశం క్రీడలకు ఆతిథ్యమిచ్చే పరిస్థితుల్లో లేదని తెలిపింది. పీఎస్ఎల్ 11 మ్యాచ్‌లను కచ్చితంగా అడ్డుకుంటామని చెప్పిన ఆ గ్రూప్.. ఈ మేరకు విడుదల చేసిన ఓ లేఖలో 'ప్రస్తుతం పాకిస్థాన్‌లో మరీ ముఖ్యంగా బలూచిస్థాన్, ఖైబర్ పంక్తుంఖ్వా ప్రజలు తీవ్ర ఆందోళనకర పరిస్థితులు ఎదుర్కుంటున్నారు. ఈ ప్రాంతాల్లో పాకిస్థాన్ ఆర్మీ మా బిడ్డలపై రక్తపుటేరులను పారిస్తున్నది. ఇలాంటి సమయంలో పీఎస్ఎల్‌ను నిర్వహించడం పుండు మీద కారం చల్లినట్టే. ఈ సందర్భంగా పీఎస్ఎల్‌లో పాల్గొనబోయే విదేశీ క్రికెటర్లకు ఒక్కటే చెబుతున్నాం. మీరు తక్షణమే టోర్నీని బహిష్కరించండి. ఇక్కడ భద్రత లేదు. క్రికెట్‌కు మేం వ్యతిరేకం కాదు. కానీ పీఎస్ఎల్‌ను మాత్రం కచ్చితంగా అడ్డుకుంటాం. ఒకవేళ మా మాటను బేఖాతరు చేసి మీరు (క్రికెట్ బోర్డులు) క్రికెటర్లను ఇక్కడకు పంపిస్తే వారికి ఏం జరిగినా మా బాధ్యత లేదు. ఈ లీగ్‌కు మాత్రం అడుగడుగునా అంతరాయం కల్గిస్తాం. ఆటగాళ్లను మైదానంలో అడుగుపెట్టనివ్వం' అని హెచ్చరించింది. ఇదిలాఉండగా జమాత్‌ఉల్‌అహ్రార్ హెచ్చరించినా ఆసీస్ క్రికెటర్ స్టీవ్ స్మిత్.. సోమవారం కరాచీ చేరుకోవడం గమనార్హం.

యుద్ధ వాతావరణంలో నేను ఆడలేను

ఈనెల 28 నుంచి మధ్య ఆసియాలోని ద్వీప దేశం సైప్రస్‌లో నిర్వహించబోయే క్యాండిడేట్స్ టోర్నీ నుంచి వైదొలిగినందుకు గాను భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తన నిర్ణయాన్ని సమర్థించుకుంది. చుట్టూ యుద్ధ మేఘాలు కమ్ముకున్న చోట ప్రశాంతంగా ఆడటం అసాధ్యమని తెలిపిన ఆమె.. ఫిడే విధించే జరిమానాల గురించి భయం లేదని పేర్కొంది. ఇదే విషయమై సోమవారం ఆమె ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. 'గత మూడు నెలల నుంచి ఈ టోర్నీ కోసం సిద్ధమవుతున్నా. నా కూతురుతో కూడా గడుపకుండా ఈ టోర్నీ కోసమే సన్నద్ధమయ్యా. అలాంటి నేను టోర్నీ నుంచి వైదొలిగానంటే ఏదో సరదా కోసమైతే కాదు కదా. చుట్టూ యుద్ధనౌకలు ఉన్న చోట మీరు ప్రశాంతంగా ఎలా ఆడగలరు?' అని తెలిపింది. 16 మంది పాల్గొనబోయే ఈ టోర్నీ నుంచి హంపి ఒక్కతే వైదొలిగిన నేపథ్యంలో ఆమెపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిడే కూడా ఆమెపై జరిమానా విధించే అవకాశమున్నట్టు వార్తలొస్తున్న నేపథ్యంలో ఆమె స్పందిస్తూ.. 'వాళ్లు జరిమానాలు వేసినంత మాత్రానా నిజాలు మాట్లాడొద్దని కాదు. వాటి (ఫైన్) గురించి నేను భయపడటం లేదు. నేనేం డబ్బు కోసం ఆడటం లేదు' అని ఘాటుగా సమాధానమిచ్చింది. లెబనాన్, ఇజ్రాయెల్ మధ్యలో ఉన్న ఈ ద్వీప దేశంపై ఇటీవల ఓ డ్రోన్ కూలడంపై సైప్రస్ అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని హంపి గుర్తుచేసింది.

స్టార్క్ వస్తున్నాడా..?

ఐపీఎల్‌లో ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడా? ఉండడా? అన్నదానిపై అనిశ్చితి కొనసాగుతున్నది. లీగ్‌లో తమ తొలి మ్యాచ్ (ఏప్రిల్ 1) కంటే ముందే అతడు జట్టుతో కలుస్తాడని ఢిల్లీ క్యాపిటల్స్ ధీమాతో ఉన్నప్పటికీ క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) నుంచి మాత్రం స్పష్టమైన ఆదేశాలు రాలేదు. ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో క్యాపిటల్స్ హెడ్‌కోచ్ హేమాంగ్ బదానీ మాట్లాడుతూ.. 'సీఏ ఎన్‌వోసీ కోసం వేచిచూస్తున్నాం. అది అందినాకే స్టార్క్ అందుబాటులో ఉంటాడా? ఉండడా? అన్నదానిపై స్పష్టత వస్తుంది' అని అన్నాడు. క్రికెట్ డైరెక్టర్ వేణుగోపాల్ రావు మాట్లాడుతూ.. 'స్టార్క్ వస్తాడు. సీఏ నుంచి స్పష్టత రావడమే తరువాయి. ఈ విషయంలో సీఏతో మా ఫ్రాంచైజీ ప్రతినిధులు టచ్‌లో ఉన్నారు. అన్నీ కుదిరితే మా తొలి మ్యాచ్ కంటే ముందే అతడు జట్టుతో కలుస్తాడు' అని అన్నాడు.

'బైకర్' ట్రైలర్‌పై ప్రభాస్ ప్రశంసలు..

టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ "బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది" అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు.

మే 1న వస్తున్న 'గాయపడ్డ సింహం'

టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గాయపడ్డ సింహం. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించి టీజర్, ట్రైలర్ కలయికతో 'ట్రైజర్'ను తాజాగా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. టైజర్ సైటైరికల్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ ఎలిమెంట్స్ తో కలయికతో ఫన్‌గా సాగుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటు చేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుందని టైజర్‌తో హింట్ ఇచ్చాడు. ఆ యువకుడు వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ హింట్ ఇచ్చేస్తుంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి. ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుద తేదీపై మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ మూవీ మే 1న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. రాంచరణ్ నటిస్తోన్న పెద్ది రిలీజైన మరుసటి రోజే అన్నమాట.

బైకర్‌తో బంపర్ బ్లాక్ బస్టర్ కొడుతున్నాం

చార్మింగ్ స్టార్ శర్వా

చార్మింగ్ స్టార్ శర్వా, భిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హైఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. డాల్బీ సినిమా, EPIQ, 4DX, PCX వంటి ప్రీమియం ఫార్మాట్లలో ఈ చిత్రాన్ని ఘనంగా విడుదల కానుంది. దీంతో ఈ యాక్షన్‌ప్యాక్డ్ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. ప్స్‌లు, పాటలు, ఇతర ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ను సృష్టించాయి. ఈ రోజు మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఇండియన్ రేసర్లు ప్రపంచ స్థాయి ప్రతిభావంతులతో సమానంగా నిలబడగలరా అని ఒక ఫారిన్ స్పోర్ట్స్ యాంకర్ ప్రశ్నించడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. క్రమశిక్షణ వున్నప్పటికీ, పరిష్కారం కాని సంఘర్షణలు ఉన్న రైడర్‌గా విక్కీ పరిచయం అవుతాడు. అతని పోరాటాలు ట్రాక్‌పైనే కాదు, అతన్ని పెంచి, శిక్షణ ఇచ్చిన తండ్రితో. వారి మధ్య ఉన్న బాండింగ్ కథకు అద్భుతమైన ఎమోషన్‌ని యాడ్ చేస్తోంది.శర్వ ఈ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు. రేసర్ గా ఆయన ప్రజెన్స్ అదిరిపోయింది. ఈ పాత్ర కోసం ఆయన ఫిజికల్ ట్రాస్‌ఫర్మేషన్ మెస్మరైజ్ చేస్తోంది. నను తాను నిరూపించుకోవడానికి తపించే కొడుకు ఎమోషన్ ని అద్భుతంగా పండించారు. శర్వా ఇంటెన్స్ యాక్టింగ్ నెక్స్ట్ లెవల్ లో ఉంది. రాజశేఖర్ రాజీపడని తండ్రిగురువుగా పాత్రకు బలాన్ని చేకూర్చారు. ఆయన రీఎంట్రీలో ఇంతటి ఇంటెన్స్ పాత్రలో అతన్ని చూడటం కొత్తగా వుంది. అలజడితో కూడిన విక్కీ ప్రపంచంలో మాళవిక నాయర్ ప్రశాంతతను అందిస్తుంది. అతుల్ కులకర్ణి విలన్ ఛాయలున్న పాత్రను పోషించారు. వీరందరూ కలిసి అత్యంత ఉత్కంఠ భరితంగా అనిపించే ఒక డ్రామాను అందించారు. విజువల్ గా ట్రైలర్ అబ్బురపరిచింది. జె యువరాజ్ కెమెరా వర్క్ మోటోక్రాస్‌లోని ప్రమాదం, వేగాన్ని అత్యంత అద్భుతంగా చిత్రీకరించగా, గిబ్రాన్ అందించిన ఉత్కంఠభరితమైన సంగీతం ప్రతి రేసును ఒళ్లు గగుర్పొడిచే అనుభవంగా మారుస్తుంది. యూవీ క్రియేషన్స్ వారి నిర్మాణ విలువలు ప్రతి ఫ్రేమ్‌లోనూ అద్భుతంగా కనిపిస్తూ గొప్ప థియేటర్ అనుభూతినిచ్చేలా వున్నాయి. 'బైకర్' ట్రైలర్ రెగ్యులర్ స్పోర్ట్స్ డ్రామాలకు భిన్నంగా ఒక హైవోల్టేజ్ రైడ్‌ను అందిస్తుందని ప్రామిస్ చేస్తోంది.

'డెకాయిట్' సెకండ్ సింగిల్

మార్చి 28న రిలీజ్

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్ లో డెకాయిట్ 'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే మొదటి సాంగ్ 'రుబారు'.. అన్నీ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. డెకాయిట్ సెకండ్ సింగిల్ చిచ్చుబుడ్డి మార్చి 28న రిలీజ్ కానుంది. ఇది అదిరిపోయే డాన్సింగ్ నెంబరు. ఈ పాట కోసం చార్ట్ బస్టర్ ట్యూన్ కంపోజ్ చేశారు. ఈ సాంగ్లో అడివి శేష్ డాన్సింగ్ మూమెంట్స్ స్పెషల్ ఎట్రాక్షన్ గా ఉండబోతున్నాయి. ఈ మూవీని ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మాణంలో, సునీల్ నారంగ్ సహనిర్మాతగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న 'డెకాయిట్ ''కి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ దనుష్ భాస్కర్ రగ్డ్ విజువల్స్‌ను అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో బ్లాక్ బస్టర్ ఆల్బమ్ అందిస్తున్నారు. గ్యాని అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎమోషన్ మరింతగా పెంచనుంది.

సంబరాల ఏటిగట్టు

శ్రీకాంత్ బర్త్ డే స్పెషల్ పోస్టర్

మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్‌ఇండియా స్పెక్టికల్ SYG (సంబరాల ఏటిగట్టు) తో ఇంతకు ముందెన్నడూ చూడని ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వంలో పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నెక్స్ట్ లెవల్ లో రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో సీనియర్ హీరో శ్రీకాంత్ పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ఈ రోజు శ్రీకాంత్ బర్త్ డే సందర్భంగా ఆయన్ని బ్రిటిషుగా పాత్రలో ప్రజెంట్ చేస్తూ కొత్త పోస్టర్ రిలీజ్ రిలీజ్ చేశారు. ప్రతి గాయాన్ని ఒక పతకంలా ధరించే సైనికుడుగా ఆయన లుక్ అదిరిపోయింది. ఈ పోస్టర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. టాప్ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తోంది. సినిమాటోగ్రఫీని వెట్రి వేల్ పళనిసామి అందిస్తుండగా, సంగీతాన్ని బి. అజనీష్ లోకనాథ్ సమకూరుస్తున్నారు. ఎడిటింగ్‌ను నవీన్ విజయకృష్ణ నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను గాంధీ నడికుడికర్ రూపొందిస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200